# 29 వ అధ్యాయము

# ప్రభువు రాక మరియు యుగాంతము

మానవ శరీరధారుడై యేసు ఈ భూమి మీద నడిచినప్పుడు తాను ఈ భూమి నుండి వెడలిపోయి తిరిగి మరి యొక దినమున ఈ భూమి మీదకి వత్తునని చాలా స్పష్టముగా తన శిష్యులతో చెప్పెను. ఆయన తిరిగి వచ్చినప్పుడు తనతో పాటు తన శిష్యులను పరలోకములోనికి తీసుకువెళ్ళును (దానిని ఆధునిక క్రైస్తవులు రాప్చర్ (Rapture) అని పిలుస్తారు). ఉదా: ఆయన సిలువ వేయబడిన ముందటి రాత్రి నమ్మకస్తులైన తన పదుకొండు మంది అపొస్తలులతో యేసు ఈలాగు చెప్పెను,

> మీ హృదయము కలవరపడనియ్యకుడి, దేవుని యందు విశ్వాస ముంచుచున్నారు నాయందును విశ్వాస ముంచుడి. నా తండ్రి ఇంట అనేక నివాసములు కలవు, లేని యెడల మీతో చెప్పుదును, మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరలా వచ్చి నా యొద్ద నుండుటకు మిమ్మును తీసుకొని పోవుదును (యోహాను 14:1-3).

యేసు మాటలలో స్పష్టముగా గమనించిన యెడల ఈ పదుకొండుమంది అపొస్తలులు జీవించి ఉన్న కాలములోనే ఆయన మరలా వచ్చునని వారు నమ్మి యుండిరి. వాస్తవముగా యేసు మాటలు విన్న తరువాత తాము బ్రతుకుచూ ఉండిన కాలములోనే ఆయన తిరిగి వచ్చునని వారు నిస్సందేహముగా నమ్మిరి.

అనేక పర్యాయములు యేసు కూడా తన శిష్యులను తన రెండవ రాకడ కొరకు ఎల్లప్పుడు ***సిద్ధపడియుండుడని*** హెచ్చరించి యున్నాడు. అందుచేత తాము బ్రతికి యున్నకాలములోనే యేసు తప్పక తిరిగి వచ్చునని వారు రూఢిగా నమ్మిరి (ఉదా: మత్తయి 24:42-44).

## యేసురాక చాలా సమీపముగా ఉన్నదని నూతన నిబంధన పత్రికలలో తెలుపుచున్నది

నూతన నిబంధనలోని పత్రికలను వ్రాసిన అపొస్తలులు ఆ ఉత్తరము చదువు మొదటి శతాబ్దపు క్రైస్తవ కాలములోనే యేసు తిరిగి వచ్చునని చాలా స్పష్టముగా వ్రాసి ఉండిరి. యాకోబు తన పత్రికలో వ్రాయుచు,

> సహోదరులారా, ప్రభువు రాకడ వరకు ఓపిక కలిగియుండుడి; చూడుడి, వ్యవసాయకుడి తొలకరి వర్షమును, కడవరి వర్షమును సమకూడు వరకు విలువైన భూ స్థలముల నిమిత్తము ఓపికతో కాచుకొనును,

దాని కొరకు కనిపెట్టును కదా. ***ప్రభువు రాక సమీపించుచున్నది గనుక*** మీరును ఓపిక కలిగియుండుడి, మీ హృదయములను స్థిరపరచుకొనుడి (యాకోబు 5:7-8).

వారి జీవిత కాలములో ఒకవేళ ఇది సంభవించదని యాకోబు అనుకొనిన పక్షమున తన ఉత్తరము చదువు పాఠకులకు అలాగు వ్రాసి వారిని హెచ్చరించి ఉండడు. ప్రభువు రాక "సమీపముగా" ఉన్నదని తాను దృఢముగా నమ్ముటను బట్టియే ఆయన అలాగు వ్రాసి యున్నాడు. మరియు యాకోబు పత్రిక వ్రాయు కాలములో క్రైస్తవ సంఘం అనేక హింసల గుండా సాగిపోవుచుండెను (యాకోబు 1:2-4). ప్రభువు రాకడ కొరకు విశ్వాసులు కూడా ఎంతో ఆశతో కనిపెట్టుకొని యున్నారు.

అలాగుననే పౌలు కూడా తన సమకాలికులైన అపొస్తలుల జీవిత కాలములోనే యేసు తప్పక వచ్చునని ఆయన రూఢిగా నమ్మి తన పత్రికలలో వ్రాయుచున్నాడు:

సహోదరులారా, నిరీక్షణలేని యితరులవలె మీరు దు:ఖపడకుండు నిమిత్తము, నిద్రించుచున్న వారిని గూర్చి మీకు తెలియకుండుట మా కిష్టము లేదు. యేసు మృతి పొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసు నందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడా వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువు మాటను బట్టి మీతో చెప్పునదేమనగా, ***ప్రభువు రాకడవరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించిన వారికంటే ముందుగా ఆయన సన్నిధి చేరము***. ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును, క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ***ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము***. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడా ఉందుము. కాబట్టి మీరు ఈ మాటలచేత, ఒకరినొకరు ఆదరించుకొనుడి (1 థెస్స 4:13-18).[72]

దీని నుండి మనము గ్రహించునది ఏమనగా పరలోకము నుండి ప్రభువు దిగివచ్చినప్పుడు ప్రభువు నందు విశ్వాసముంచిన వారి మృత దేహము పునరుత్థానము చెందుననియు సజీవులైన విశ్వాసులతో కూడా మృతులైన విశ్వాసులు లేచి వారందరు కలసి ఆకాశ మండలమందు మేఘముల మీద ప్రభువును కలుసుకొని ఆయనతో కూడా పరలోకములోనికి వెళ్ళి పోవుదురు (ఇదియే రాప్చర్). ఆయన యందు విశ్వాసముంచి మృతి

[72]తన సమకాలికులైన అపొస్తలులు జీవించు కాలములోనే యేసు తిరిగి వచ్చును అని పౌలు నమ్ముతున్నట్లుగా చూపిస్తున్న మరికొన్ని లేఖన భాగములు ఇవి: ఫిలిప్పీ 3:20; 2 థెస్స 3:13; 5:23; 2 థెస్స 2:1-5; 1 తిమోతి 6:14-15; తీతుకు 2:11-13; హెబ్రీ 9:28.

చెంది క్రీస్తునందున్న వారిని పరలోకము నుండి ప్రభువు తనతో కూడా వెంటబెట్టుకొని వచ్చునని పౌలు వ్రాయుచున్నాడు. ప్రభువు వచ్చుటను గూర్చి మనము చివరగా నమ్మునది ఏమనగా విశ్వసించిన వారి ఆత్మను పరలోకము నుండి తిరిగి వచ్చి అప్పుడే పునరుత్థానము చెందిన వారి వారి శరీరములతో కలుసుకొని ప్రభువు రాకడలో పాలు పొందుదురు.

తన పత్రికలో వ్రాయుచు పేతురు కూడా క్రీస్తు వెనువెంటనే అతి త్వరలోనే రానై యున్నాడని నమ్మెను:

> కాబట్టి మీ మనస్సు అను నడుము కట్టుకొని నిబ్బరమైన బుద్ధి గలవారై ***యేసు క్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు తేబడు కృప విషయమై సంపూర్ణ నిరీక్షణ కలిగియుండుడి*** (1 పేతురు 1:13) ***అయితే అన్నిటి అంతము సమీపమై యున్నది.*** కాగా మీరు స్వస్థ బుద్ధిగలవారై ప్రార్థన చేయుటకు మెలకువగా ఉండుడి (4:7). ***క్రీస్తు మహిమ బయలు పరచబడినప్పుడు మీరు మహానందముతో సంతోషించు నిమిత్తము***, క్రీస్తు శ్రమలలో మీరు పాలివారై నంతగా సంతోషించుడి (4:13). [73]

చివరిగా, యోహాను వ్రాయుచు సంఘములకు తాను వ్రాసిన ఉత్తరములలో అంతము చాలా సమీపముగా ఉన్నదని నమ్ముచు తన పత్రికలు చదువు పాఠకులు తాను జీవించి ఉన్న దినములలోనే ప్రభువు తిరిగి వచ్చుట చూతురని నమ్ముచూ వ్రాసెను:

> చిన్న పిల్లలారా, ***యిది కడువరి గడియ.*** క్రీస్తు విరోధి వచ్చునని వింటిరి గదా ఇప్పుడును అనేకులైన క్రీస్తు విరోధులు బయలుదేరియున్నారు; ***ఇది కడువరి గడియ*** అని దీనిచేత తెలిసికొనుచున్నాము....కాబట్టి చిన్న పిల్లలారా, ***ఆయన ప్రత్యక్ష మగునప్పుడు ఆయన రాకడయందు మనము ఆయన యెదుట సిగ్గుపడక ధైర్యము కలిగియుండునట్లు*** మీరాయన యందు నిలిచియుండుడి....ప్రియులారా, యిప్పుడు మనము దేవుని పిల్లలమై యున్నాము. మనమిక ఏమవుదుమో అది ఇంక ప్రత్యక్షపరచబడలేదు గాని ***ఆయన ప్రత్యక్షమైనప్పుడు ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము గనుక ఆయనను పోలి యుందుమని యెరుగుదును.*** ఆయనయందు ఈ నిరీక్షణ పెట్టుకొనిన ప్రతి వాడును ఆయన పవిత్రుడై యున్నట్టుగా తన్ను పవిత్రునిగా చేసికొనును (1 యోహాను 2:18, 28, 3:2-3).

## ఆయన ఆలస్యము

రెండు వేల సంవత్సరములు మనము వెనుకకు తిరిగి చూచినచో అపొస్తలులు

---

[73] తన సమకాలికులు జీవించు కాలములోనే యేసు తిరిగి రానైయున్నాడు అన్న పౌలు నమ్మకాన్ని తెలిపే మరికొన్ని లేఖనభాగాలు 2 పేతురు 1:15-19; 3:3-15.

నిరీక్షించిన విధముగా ఆయన వెనువెంటనే రాలేదు అని మనము గ్రహించ వచ్చును. వారు జీవించి ఉండిన దినములలోనే ప్రభువు రాకను గూర్చి వారిలో కొందరికి అనుమానములు ఉండినవి. ఆయన వెడలి పోయిన తరువాత ఎంత కాలమునకు తిరిగి వచ్చునో వారికి రూఢిగా తెలియ రాలేదు. ఎందుకనగా పేతురు యొక్క భూసంబంధమైన జీవిత కాలము త్వరలో ముగియనున్నది. ఉదా: 2పేతురు 1:13-14 మరియు "మన ప్రభువైన యేసుక్రీస్తు నాకు సూచించిన ప్రకారము నా గుడారము త్వరగా విడిచిపెట్టవలసి వచ్చునని ఎరిగి, నేను ఈ గుడారములో ఉన్నంత కాలము ఈ సంగతులను జ్ఞాపకము చేసి మిమ్మును రేపుట న్యాయమని ఎంచుకొనుచున్నాను (2 పేతురు 1:13-14). యేసు అప్పటి కింకను తాను చెప్పినట్లు తిరిగి రాలేదు. అందుచేత ఆయన రాకడ గూర్చిన సందేహములు గల కొందరికి ఆయన తన చివరి ఉత్తరములో ఈలాగు వ్రాయుచున్నాడు:

> అంత్యదినములలో అపహాసకులు అపహసించుచువచ్చి, తమ స్వకీయ దురాశల చొప్పున నడుచుకొనుచు, ఆయన రాకడను గూర్చిన వాగ్దాన మేమాయెను? పితరులు నిద్రించినది మొదలుకొని సమస్తమును సృష్టి ఆరంభమునందున్నట్టే నిలిచి యున్నదే అని చెప్పుదురని మొదట మీరు తెలిసికొనవలెను. ఏలయనగా పూర్వమునుండి ఆకాశముండెననియు, నీళ్ళలో నుండియు నీళ్ళవలనను సమకూర్చబడిన భూమియు దేవుని వాక్యమువలన కలిగెననియు వారు బుద్ధిపూర్వకముగా మరతురు. ఆ నీళ్ళవలన అప్పుడున్న లోకము నీటివరదలో మునిగి నశించెను. అయితే ఇప్పుడున్న ఆకాశమును భూమియు భక్తిహీనుల తీర్పును నాశనమును జరుగు దినమువరకు అగ్నికొరకు నిలువచేయబడినవై, అదే వాక్యమువలన భద్రముచేయబడియున్నవి. ప్రియులారా, ఒక సంగతి మరచిపోకుడి. ఏమనగా ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యిసంవత్సరములవలెను, వెయ్యి సంవత్సరములు ఒక దినమువలెను ఉన్నవి. కొందరు ఆలస్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలస్యము చేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు. అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచబూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును (2 పేతురు 3:3-10).

యేసు చేయనున్న ఆలస్యము ఆయనకు మానవుల పట్ల ఉన్న ప్రేమ దయ కారణము కావచ్చునని పేతురు నొక్కి వక్కాణించుచున్నాడు. పశ్చాత్తాప పడి దేవుని తట్టు తిరుగుటకు ఆయన ఇంకా ఎక్కువ కాలము జనులకు ఇవ్వవలెనని కోరుచున్నాడు. అయితే యేసు రెండవ రాకడను గూర్చి ఆయనకు ఏమాత్రమైనను సందేహము లేదు. ఆయన తప్పక తిరిగి వచ్చునని రూఢిగా నమ్ముచున్నాడు అయితే ఆయన వచ్చునప్పుడు మహా రౌద్రముతోను, ఉగ్రతతోను వచ్చునని నమ్ముచున్నాడు.

లేఖనముల యందు కూడా మనము స్పష్టముగా గమనించునది ఏమనగా ప్రభువు రెండవ రాకడ ఉగ్రతతోను ప్రచండమైన కోపముతోను ఆయన వచ్చుననియు దానికి ముందుగానే ప్రపంచమంతట మహా శ్రమలు దుర్మార్గులు, దుష్టులపై దేవుని మహోగ్రత కుమ్మరించబడి గొప్ప విపత్తులు సంభవించునని వాక్యములో మనము చూచుచున్నాము. భవిష్యత్తు కాలములో జరుగబోవు దాని అంతటిని గూర్చి ప్రకటన గ్రంథములో విస్తారముగా వ్రాయబడి ఉన్నది. దానిని మనము తరువాత చూడవచ్చును. దేవుని వాక్యములో సూచింపబడినది ఏమనగా 7 సం॥ల కాల పరిమితిలో శ్రమల మధ్యనే సంఘము పైకెత్తబడుట జరుగవచ్చును.

## ఈ రాప్చర్ అనునది వాస్తవముగా ఎప్పుడు సంభవించును?

ప్రభువు వచ్చుటను గూర్చిన ఈ అంశము అనేక మంది క్రైస్తవులలో సంశయము, గలిబిలి, కలవరములు కలిగించి వారి అభిప్రాయములలో వారు రెండు భాగములుగా చీల్చబడుచున్నారు. 7 సం॥ల శ్రమల కాలమునకు ముందే ప్రభువు వచ్చుట, సంఘము పైకెత్తబడుట సంభవించునని చెప్పుదురు. అందుచేత అది ఏ కాలమందైనను జరుగవచ్చును. 7 సం॥ల మహా శ్రమల మధ్య కాలములో ఈ రాప్చర్ అనునది జరుగునని మరి కొందరు నమ్ముచున్నారు. అయితే మరి కొందరు యేసు ప్రభువు మహా ఉగ్రతతో రౌద్రముతో ఎప్పుడు వచ్చునో అప్పుడు ఈ మహా శ్రమలు అంతమగును, అప్పుడు ఈ రాప్చర్ అనునది సంభవించునని చెప్పెదరు.

మనుష్యులలో భిన్నాభిప్రాయములు కలిగినను దానికి కారణం ఈ రాప్చర్ అనే అంశము కాదు. ఈ నాలుగు విధములుగా తమ అభిప్రాయములలో వేరైపోయినందున జ్ఞాపకము ఉంచుకోవలసినది ఏమనగా భవిష్యత్తులో జరుగబోవు 7 సం॥ల శ్రమల కాలమునకు సమీపమునకు లేక శ్రమ కాలములో ఇది సంభవించునని వారు అంగీకరించ వలసి ఉన్నారు. ఈ వేల సం॥ల క్రైస్తవ సంఘ చరిత్రలో ఇది చాలా ఇరుకైన కిటికీ వంటిది. అంగీకార విషయములో విభేదించుట కంటే ప్రభువు తప్పక వచ్చునని విషయములో ఒకరితో ఒకరు ఏకీభవించి సంతోషించుట మంచిది. ఏమి సంభవింపనైనదో దానిని మనలో ఎవరైనను మార్పుచేయజాలరు.

ఏడు సంవత్సరముల మహా శ్రమల కాలమునకు ముందు రాప్చర్ సంభవించునని 25 సం॥ల నా క్రైస్తవ జీవితములో నేను నమ్మియుంటిని ఎందుకనగా నేను ఆ విధముగానే మొదటి నుండి నేర్పింపబడితిని. ప్రకటన గ్రంథములో ఏమి వ్రాయబడి ఉన్నదో దానిని గూర్చి

తెలుసుకొనుటకు ఆ గ్రంథమును చదువుటకు ఇష్టము లేని వాడనైయుంటిని. అయితే దైవ లేఖనములును నాకు నేనుగా చదువుట ఆరంభించినప్పుడు నేను ఈ విషయమై మరియొక అభిప్రాయములోనికి నడిపించబడితిని. అందుచే మనము మరియొక సారి బైబిలు గ్రంథమును చదివి దాని నుండి ఏ విధమైన తలంపుకు నడిపించబడితినో చివరకు చూతుము. ఒకవేళ మీరు నా అభిప్రాయమును అంగీకరించక పోయినను ఒకరి యెడల మరియెకరు ప్రేమ కలిగియుందుము.

## ఒలీవల కొండపై యేసు చేసిన ఉపదేశం

యేసు వారి రెండవ రాకడను ఈ కాలాంతమునకును సంభవించు సూచనలను గూర్చి దేవుని వాక్యములో పునాది సిద్ధాంతముగా పరిగణింపబడు దానిని మనము మత్తయి 24వ అధ్యాయం చదువుట ద్వారా గమనించగలుగుతాం. దానికి జతగా 25వ అధ్యాయం చదువవలెను ఎందుకనగా ఈ ఉపదేశమంతయు యేసువారు ***ఒలీవల కొండపైన*** చేసిరి. తనకు అత్యంత సన్నిహితమైన శిష్యులకు[74] ఈ రెండు అధ్యాయములలో ఉపదేశమును ప్రసంగ రూపముగా యేసు అందించెను. అది మనము చదివినప్పుడు యుగాంతమందు సంభవించబోవు అనేక సంఘటనలను సూచనలను అవి మనకు నేర్పించును. ఈ రాప్చర్‌ను గురించి ఎప్పుడు సంభవించునో అను దాని కాలసూచిక యేసు వారి ప్రసంగము నుండి ఆయన శిష్యులు ఏమి గ్రహించిరో మనము గమనింతుము:

> యేసు దేవాలయమునుండి బయలుదేరి వెళ్ళుచుండగా ఆయన శిష్యులు ఆ దేవాలయపు కట్టడములు ఆయనకు చూపింపవచ్చిరి. అందుకాయన, మీరు ఇవన్నియు చూచుచున్నారు గదా, రాతిమీద రాయి యొకటియైనను ఇక్కడ నిలిచియుండకుండ పడద్రోయబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో అనెను. ఆయన ఒలీవ కొండమీద కూర్చుండి యున్నప్పుడు శిష్యులాయనయొద్దకు ఏకాంతముగా వచ్చి-ఇవి ఎప్పుడు జరుగును? నీ రాకడకును ఈ యుగసమాప్తికిని సూచనలేవి? మాతో చెప్పుమనిరి (మత్తయి 24:1-3).

భవిష్యత్తులో ఏమి జరగనైయున్నదో దానిని శిష్యులు తెలుసుకొనగోరిరి. ఈ దేవాలయము ఎప్పుడు పడగొట్టబడునో స్పష్టముగా వారు తెలుసుకొన గోరిరి (ఎందుకనగా రాతి మీద రాయి నిలుచు ఉండు కాలమొచ్చునని యేసు వారికి చెప్పెను) మరియు ఆయన రెండవ రాకడకును యుగాంతమునకు సూచనలు ఏవని వారు ఆయనను అడిగిరి.

మనము ఈ వెనుకటి సంగతులను తిరిగి చూచిన యెడల ఈ దేవాలయ భవన సముదాయమును క్రీ॥శ॥ 70వ సం॥న రోమా సైన్యాధ్యక్షుడైన టైటస్ రోమీయుల సైన్యం

---

[74]మార్కు 13:3 నందు ఒలీవల కొండమీద ఉన్న నలుగురి పేర్లు అగుపించుచున్నవి. పేతురు, యాకోబు, యోహాను మరియు అంద్రేయ. ఒలీవల కొండ ఉపదేశము మార్కు 13:1-37 నందు కూడా లిఖించబడెను మరియు లూకా 21:5-36; లూకా 17:22-37 నందు కూడా ఈ సమాచారము పొందు పరచబడెను.

వాటిని సమూలముగా నేలమట్టము చేసి ధ్వంసము చేసెను. తన సంఘమును తన యొద్దకు ప్రోగుచేసుకొనుటకు యేసు ఇప్పటికిని తిరిగి రాలేదని మనము గ్రహించుచున్నాము. అందును బట్టి ఈ రెండు సంఘటనలను ఒక దానితో మరి యొకటి కలిసి జరుగునని మనము గ్రహింపవలెను.

## వారి ప్రశ్నలకు యేసు ఇచ్చు జవాబులు

దేవాలయము యొక్క విధ్వంసమును గూర్చి అడుగబడిన మొదటి ప్రశ్నకు యేసు ఇచ్చిన జవాబును మత్తయి తన సువార్త యందు లిఖించలేదు, అయితే లూకా ఈ విషయమును గూర్చి తన సువార్తలో వ్రాసెను (లూకా 21:12-24). అయితే యుగాంతమందు ప్రభువు రాకకు ముందుగా ఏమి సూచనలు కనబడునో మత్తయి తన సువార్త యందు వ్రాసెను:

యేసు వారితో ఇట్లనెను-ఎవడును మిమ్మును మోసపరచకుండ చూచుకొనుడి. అనేకులు నా పేరట వచ్చి-నేనే క్రీస్తునని చెప్పి పలువురిని మోసపరచెదరు. మరియు యుద్ధములను గూర్చి యుద్ధసమాచారములను గూర్చియు వినబోదురు; మీరు కలవరపడకుండ చూచుకొనుడి. ఇవి జరగవలసియున్నవి కాని అంతము వెంటనే రాదు. జనముమీదికి జనమును రాజ్యముమీదికి రాజ్యమును లేచును. అక్కడక్కడ కరవులును భూకంపములును కలుగును; ఇవన్నియు వేదన లకు ప్రారంభము (మత్తయి 24:4-8).

యేసు వారి ఉపదేశము ప్రారంభములోనే ఆయన నమ్మినదేమనగా మొదటి శతాబ్ధపు శిష్యులు ఆయన రెండవ రాకడకు ముందు సంభవించబోవు సంఘటనలను వారు జీవించి ఉండగానే చూచెదరని నమ్మెదరు. ఈ ప్రసంగము నందు ఎన్నో పర్యాయములు యేసు శిష్యులను ఏక వచన సర్వనామము నీవు లేక మీరు అనుపదమును ఉపయోగించెను. ఈ వ్యక్తిగతమైన సర్వనామము "మీరు" అనునది 24వ అధ్యాయములో సుమారు 20 పర్యాయములు ఆయన ఉపయోగించెను. యేసు ఏమి జరుగునని ముందుగా వారికి తెలియ జేసెనో ఆ బోధ విన్న వారందరు తాము జీవించి ఉండగానే అవి సంభవించుట చూచెదమని నమ్మిరి.

ఆ దినమున యేసు ప్రసంగం వినిన ఆయన శిష్యులలోని వారందరూ ఎన్నో సం॥ల క్రిందట చనిపోయారని మనకు తెలియును. గనుక ఈ మాటలు చెప్పి యేసు వారిని మోసపుచ్చెనని మనము తలంచరాదు. ఎందుకనగా ప్రభువు రాకడ ఎప్పుడో వాస్తవముగా కుమారుడిగా ఉండి తాను కూడా ఎరుగకుండెను (మత్తయి 24:36). ఒలీవల కొండ మీద ఆయన బోధ విన్న వారు ఆయన వచ్చు వరకు జీవించి ఉందురు అనునది సాధ్యమైన విషయమే.

తన శిష్యులు విషయమై యేసుకు కలిగిన ప్రత్యేక ఆసక్తి ఏదనగా వారు ఈ అంత్యకాలములో బయలుదేరు అనేక మంది అబద్ధ క్రీస్తులు యొక్క మోసములోను పడిపోకూడదని ఆయన ఈ సంగతులు ముందుగా తెలియజేసెను. అతడొక అద్భుతమైన గొప్ప రక్షకుడని ప్రజలు వారిని గూర్చి భావింతురు.

యేసు వారికి ముందుగా తెలియచెప్పినది ఏమనగా యుద్ధములు,కరవులు

భూకంపములు మొ॥ సంభవించును కాని ఆయన రాకడకు ఇవి ఏమాత్రము సూచనలు కావు కాని అవి "గర్భిణీ స్త్రీకి మొదటిగా వచ్చు ప్రసవనొప్పులు" వంటివి. ఈ 2000ల సం॥లలో ఇటువంటివి మనకు అనేకమైనవి సంభవించుట చూచుచున్నాము. అయితే దాని పిదప యేసు ఏమి చెప్పెనో అది ఇంకను సంభవించి యుండలేదు.

## ప్రపంచ వ్యాప్తముగా శ్రమల కాలపు ప్రారంభం

> అప్పుడు జనులు మిమ్మును శ్రమలపాలుచేసి చంపెదరు; మీరు నా నామము నిమిత్తము సకల జనములచేత ద్వేషింపబడుదురు. అనేకులు అభ్యంతరపడి, యొకనినొకడు అప్పగించి యొకనినొకడు ద్వేషింతురు. అనేకులైన అబద్ధ ప్రవక్తలు వచ్చి పలువురిని మోసపరచెదరు. అక్రమము విస్తరించుటచేత అనేకుల ప్రేమ చల్లారును. అంతమువరకు సహించినవాడెవడో వాడే రక్షింపబడును. మరియు ఈ రాజ్య సువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; అటుతరువాత అంతము వచ్చును (మత్తయి 24:9-14).

ఒలీవల కొండ మీద యేసు చెప్పిన ఈ సంగతులు వాస్తవముగా విన్న వారికి ఆ దినమున యేసు ఈ విధముగా ప్రశ్నించి ఉండవచ్చును. ఈ సంగతులు జరుగుట చూచినప్పుడు "నీవు ఆ దినములలో జీవించి ఉండవలెనని కోరుచున్నావా?" వారు తప్పని సరిగా ఒక జవాబు చెప్పి ఉందురు. ఎందుకనగా యేసు వారిని వ్యక్తిగతముగా **మీరు** అని సంబోధించుచున్నాడు.

ఈ "ప్రసవ వేదనను' గూర్చి మనము చదివిన పిమ్మట ఒక ప్రాముఖ్య సంఘటన సంభవించునని మనము ఎదురు చూచుచున్నాము. అది ఇంకను నెరవేర్చబడలేదు. అది ఏదనగా ప్రపంచ వ్యాప్తముగా క్రైస్తవులు ఘోరముగా హింసింపబడుట. మనము సకల జనముచేత ద్వేషింపబడుదుము. అనగా వివిధ జాతుల వారు వివిధ తెగలవారు, వివిధ గుంపుల వారు క్రైస్తవులను బహు తీవ్రముగా హింసించుదురు. అది సంభవింపబోవు ఒకానొక స్పష్టమైన కాలము నందు అది జరుగునని యేసు తెలియజేయుచున్నాడు. వందల కొలది సం॥లలో సాధారణముగా ఇది జరిగినది కాదు ఎందుకంటే ఆ తరువాత వచ్చు మాటలలో యేసు చెప్పినది ఏమనగా, "అనేకులు విశ్వాసము నుండి పడిపోవుదురు, ప్రతివ్యక్తి మరియొక వ్యక్తిని ద్వేషించు కొనుచూ ఒకరిని ఒకరు అప్పగించు కొనుదురు"

అనగా విశ్వాసులు మరి ఇతర విశ్వాసులను ద్వేషించుదురు. అవిశ్వాసులు ఏ మాత్రమును "పడిపోరు" ఎందుకనగా వారు ఒకరిని ఒకరు ద్వేషించుకొనుట ఇప్పటికే జరుగుచున్నది. అనేకులు తాము క్రీస్తు అనుచరులమని, ఆయన వెంబడించువారమని చెప్పుకొనుచు విశ్వాస భ్రష్టులై ప్రపంచ వ్యాప్తముగా ఈ మహా భయంకరమైన హింస క్రైస్తవులకు అంతటను జరుగును. వారు నిజ క్రైస్తవులైనను లేక అబద్ధ విశ్వాసులైనను, గొఱ్ఱెలైనను మేకలైనను

**అనేకులు** పడిపోవుదురు. ఒకరిని గూర్చి మరియొకరు వారి వ్యక్తిగత రహస్యములను మరియు వారి గుర్తింపులను రహస్య సమాచారమంతయు ఇతరులకు తెలియజేయుదురు, మరి ముఖ్యంగా హింసలను అమలు చేయు అధికారులకు తెలియజేయుదురు. ఒకప్పుడు వారిని తామెంతో ప్రేమించుచున్నారు అని చెప్పి ఇప్పుడెంతో ఘోరముగా వారిని ద్వేషించుచున్నారు. ప్రపంచమంతట ఈ హింసల వలన శ్రమల వలన క్రైస్తవ సంఘం శుద్ధీకరించబడును.

అటుపిమ్మట అనేకమంది అబద్ధ ప్రవక్తలు పైకి లేచుదురు అలాగు పైకి లేచిన అబద్ధ క్రీస్తు అను వారిలో అగ్రగణ్యమైన ఒకడు ఎంతో హెచ్చింపబడి అతడే క్రీస్తు విరోధిగా రూపొంది ప్రకటన గ్రంథములో వివరించిన ప్రకారము అతడు ఈ మహా హింసలు శ్రమలను దుర్మార్గతను జరిగించును (ప్రకటన 13:11-18; 19:20; 20:10). చట్టవిరోధమైన అక్రమము ఎంతో హెచ్చుగా అభివృద్ధి చెంది జనుల హృదయములో ఏ కొంచెము ప్రేమ ఉండునో అట్టి దానిని సంపూర్తిగా తుడిచి వేసి మనుష్యులు వారి హృదయములను బహు ఘోరముగా కఠినపరచుకొని పాపాత్ములగుదురు.

## హతసాక్షులు మరియు జీవించుచుండువారు

విశ్వాసులు తమ జీవితములను తమ ప్రాణములను కోల్పోవుదురని ముందుగానే యేసు హెచ్చరించి యుండినను (మత్తయి 24:9) అందరు అలాగు నశించరు. అయితే అంతము వరకు సహించువారే రక్షణ నొందుదురని యేసు చెప్పెను (24:13). ఏ విశ్వాసులైతే ఈ అబద్ధ క్రీస్తును మోసపుచ్చు ప్రవక్తలు అనువారి చేత మోసగించబడక శోధనలను ఎదిరించి తమ విశ్వాసమును పోగొట్టుకొనక మరియు పడిపోకుండా అంతము వరకు తమ్మును కాచుకొనువారు రక్షణ నొందుదురు లేక వారిని క్రీస్తు ప్రభువే వచ్చి రక్షించును. ఆయన తన కొరకు నమ్మకమైన వారిని ప్రోగుచేసుకొనుటకు ఆకాశమునుండి ఆయన వచ్చును. ఈ భవిష్యత్తు కాలమందు జరుగబోవు ఈ మహాశ్రమ మరియు విశ్వాసులు ఆ శ్రమలలో నుండి రక్షించబడుట మొ॥ వన్నియు ప్రవక్తయైన దానియేలుకు వివరముగా బయలు పరచబడెను. అతడు ముందుగానే వాటిని గూర్చి ప్రవచించుచు

> ఆ కాలమందు నీ జనుల పక్షమున నిలుచునట్టి మహా అధిపతియగు మిఖాయేలు వచ్చును. అప్పుడు నీ జనులు రాజ్యముగా కూడిన కాలము మొదలుకొని ఈ కాలము వరకును ఎన్నటికిని కలుగునంత ఆపద కలుగును. అయితే నీ జనులలో గ్రంథమునందు దాఖలైన వారెవరో వారు తప్పించుకొందురు మరియు సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు, కొందరు నిత్యజీవము అనుభవించుటకును, కొందరు నిందపాలగుటకును నిత్యముగా హేయులగుటకును మేలుకొందురు (దానియేలు 12:1-2).

చాలా ఉదారముగా ఎంతో దయతో అట్టి దినములలో కూడా రక్షణ వారికి ఇవ్వబడుటకు సిద్ధముగా ఉన్నది. రాజ్యముల యందంతటను (జాతులు, గుంపులు తెగలు)

వారందరికిని సువార్త ప్రకటింపబడునని యేసు వాగ్దానము చేసియున్నాడు. పశ్చాత్తాపడి దేవుని తట్టు తిరుగుటకు వారికి తుది అవకాశము ఇవ్వబడును, ఆ పిమ్మట అంతము వచ్చును.[75] ఆశ్చర్యకరముగా ప్రకటన గ్రంథములో కూడా యేసు చెప్పిన వాగ్దానమును గూర్చి మరలా మనము అది నెరవేర్చబడుటను గూర్చి చదువుచున్నాము.

> అప్పుడు మరియొక దూతను చూచితిని అతడు భూనివాసులకు అనగా ప్రతిజనమునకు ప్రతి వంశమునకును ఆయా భాషలు మాట్లాడు వారికిని ప్రతి ప్రజలకును ప్రకటించునట్లు నిత్య సువార్త తీసుకొని ఆకాశ మధ్యమున ఎగురుచుండును. అతడు మీరు దేవునికి భయపడి ఆయనను మహిమపరచుడి, ఆయన తీర్పు తీర్చు ఘడియ వచ్చును. గనుక ఆకాశమును భూమిని, సముద్రమును, జలధారలను కలుగచేసిన వానికే నమస్కారము చేయుడని గొప్ప స్వరముతో చెప్పెను (ప్రకటన 14:6-7).

కొంతమంది తలంచునట్లుగా సువార్త ప్రకటించుటకు ఒక దేవదూతకు అవకాశము ఇచ్చిన కారణమేమనగా ఏడేళ్ళ శ్రమకాలము అప్పటికి ముగిసి ప్రభువు వచ్చుట చేత విశ్వాసులందరు పైకెత్తబడి ఉండిరి. అందుచేత సువార్త ప్రకటించుటకు ఎవరూ లేరు గనుక దూత సువార్త ప్రకటించవలసి వచ్చెను అని కొందరు చెప్పుకొనుచు ఉందురు.

## క్రీస్తు విరోధి

ప్రవక్తయైన దానియేలుకు బయలు పరచబడిన విధముగా క్రీస్తు విరోధి ఏడేండ్ల శ్రమకాలపు మధ్య భాగంలో యెరూషలేము దేవాలయం తిరిగి నిర్మించబడిన పిమ్మట తానే దేవుడనని ప్రకటించు కొని యెరూషలేము దేవాలయములో కూర్చుండును (దానియేలు 9:27). ఒలీవకొండ మీద యేసు ప్రసంగించినపుడు ఈ సంఘటనయే యేసు వారి మనస్సులో మెదలుచుండెను.

> కాబట్టి ప్రవక్తయైన దానియేలు ద్వారా చెప్పబడిన నాశనకరమైన హేయవస్తువు పరిశుద్ధస్థలమందు నిలుచుట మీరు చూడగానే-చదువువాడు గ్రహించుగాక-యూదయలో ఉండువారు కొండలకు పారిపోవలెను. మిద్దెమీద ఉండువాడు తన యింటిలోనుండి ఏదైనను తీసికొని పోవుటకు దిగకూడదు, పొలములో ఉండువాడు తన బట్టలు తీసికొని పోవుటకు ఇంటికి రాకూడదు. అయ్యో ఆ దినములలో గర్భిణులకును పాలిచ్చువారికిని శ్రమ. అప్పుడు మహా

[75] అనేక పర్యాయములు లేఖన భాగములో నుండి ఈ వాగ్దానమును వెలుపలికి తీసి యేసు రాకడకు పూర్వము మనము సర్వ ప్రపంచములు సంపూర్తిగా సువార్తీకరణ చేయవలెనని చెప్పుదురు. అయితే యుగాంతమునకు ముందు మాత్రమే సువార్త యొక్క చివరి ప్రకటన ప్రపంచమంతటి కొరకు చేయబడవలసినదనియు ఈ వాగ్దానము ఆ లేఖన భాగమందు అమర్చబడియున్నదిని మనము గ్రహించవలెను.

శ్రమ కలుగును గనుక మీరు పారిపోవుట చలికాలమందైనను విశ్రాంతిదినమందైనను సంభవింపకుండవలెనని ప్రార్థించుడి. లోకారంభము నుండి ఇప్పటివరకు అట్టి శ్రమ కలుగలేదు, ఇక ఎప్పుడును కలుగబోదు.[76] ఆ దినములు తక్కువ చేయబడక పోయినయెడల ఏ శరీరియు తప్పించుకొనడు. ఏర్పరచబడినవారి నిమిత్తము ఆ దినములు తక్కువ చేయబడును (మత్తయి 24:15-22).

24:9లో యేసు ఇంతకు మునుపు ఈ శ్రమలను గూర్చి ఎంతో వివరముగా స్పష్టముగా బోధించి యున్నాడు. ఎప్పుడైతే క్రీస్తు విరోధి దేవాలయములో తానే దేవుడనని చెప్పి కూర్చుండునో యేసునందు విశ్వాసముంచిన వారందరికి ఊహింప నలవిగాని భయంకరమైన హింసలు శ్రమలు ప్రారంభమగును. తానే దేవుడనని ప్రకటించుకొనుట చేత మనుష్యులందరు అతని దైవత్వమును అంగీకరించవలసినదని బలవంతము చేయును. యేసుక్రీస్తు యొక్క నిజమైన విశ్వాసులు, అనుచరులు అందరు కూడా ప్రతి వారిచేత ద్వేషించబడుచుందురు, ప్రభుత్వాధికారులు వారిని దేశద్రోహులుగా ప్రకటించి వారిని వెంటాడి చంపుదురు. అందుచేతనే యేసు వారితో ఈ సంఘటనలు జరుగుట చూచినప్పుడు విశ్వాసులు యూదయ విడిచి కొండలకు పారిపోవలెననియు ఏ విధమైన కారణముబట్టి గాని వారు ఆలసింపకుండా పారిపోవలెనని వారికి బోధించెను.

ఆ సంగతి జరుగునప్పుడు బహుశా టెలివిజన్ ద్వారా ఈ సంఘటనలన్నియు ప్రపంచమంతట ప్రసారము చేయుచుందురు గనుక విశ్వాసులందరు ప్రపంచములో ఎవరు ఎన్నడు నివసించని మారుమూల ప్రదేశాలకు పారి పోవుదురు అని అనుకుంటున్నాను. సర్వ ప్రపంచము కూడా క్రీస్తు విరోధి యొక్క మోసములో పడిపోవునని లేఖనము చెప్పుచున్నది. ఈ దేవాలయములో కూర్చున్నవాడే నిజమైన క్రీస్తు అని అతనిని నమ్మి పూజించి ఆరాధించవలెనని ప్రకటించుదురు. అయితే అతడు నిజమైన దేవుని గూర్చి దుర్భాషలాడుచు క్రైస్తవుల దేవునిని దేవ దూషణ చేయుచు నిందించుచు ఉండును. ఎవరైతే ఈ క్రీస్తు విరోధిని పూజచేయరో అట్టి వారినందరిని ద్వేషించి వారిని క్రూరముగా హింసింపవలెనని ప్రపంచములోని వారందరికి మోసముతో వంచెనతో వారికి ప్రకటించును (ప్రకటన 13:1-8).

అయితే దేవుని సొంత ప్రజలైన వారికందరికిని విడుదల కలుగజేయునట్లు దేవుడు ఆ శ్రమల దినములను తక్కువ చేయును, అలాచేయనియెడల, “శరీరులలో ఎవరును తప్పించుకొనలేరు” (24:22). ఈ శ్రమకాల దినములను తక్కువ చేయుట అనునది కేవలము “తాను ఏర్పరచు కొనిన వారికి” మాత్రమే ఎందుకనగా ఆయన ఆకాశము నుండి తిరిగి వచ్చునప్పుడు ఇట్టి వారినందరిని ప్రోగు చేసుకొని పరలోకమునకు తన యొద్దకు తీసుకొని

---

[76] కొందరు చెబుతున్నట్లుగా ఒకవేళ ఏడుసంవత్సరముల శ్రమల కాలములో గనుక రాప్చర్ సంభవిస్తున్నట్లయితే, యేసు విశ్వాసులకు కొండలకు పారిపొమ్మని సూచించి ఉండేవాడేకాదు, ఎందుకంటే వారందరూ ఆయన రాకడ సమయంలో ఎత్తబడుదురు గనుక.

పోవును. క్రీస్తు విరోధి తానే దేవుడనని ప్రకటించుకొనిన తరువాత ఎంతకాలమునకు ఈ విడుదల ఏర్పరచబడిన వారి కొరకు సంభవించును అన్నది యేసు మనకు చెప్పలేదు.

ఏ కారణము చేతనైనను యేసు బోధ వినుచుండిన వారు తమ దినములలో వారు క్రీస్తు విరోధి వచ్చుననియు అతడు తానే దేవుడనని ప్రకటించి క్రైస్తవులకు వ్యతిరేకముగా పోరాటము చేయుననియు అవి తమ దినములలో సంభవించుననియు నమ్మునట్లు ఆయన బోధ వారిలో ఒక భావనను రేకెత్తించినది అన్నది మనం గమనించాలి. క్రీస్తు నందు విశ్వాసముంచిన వారు ఈ ఘోరమైన మహాశ్రమల హింసల కాలము సంభవింపకముందే ఎత్తబడుదురు అన్న కొందరి వాదనకు ఇది ధీటుగా నిలిచివుంది. ఒకవేళ పేతురు, యాకోబు, యోహానులను ప్రశ్నించి క్రీస్తు విరోధి తానే దేవుడనని ప్రకటించుకొనకముందే ప్రభువు రాక సంభవించునా అని అడిగితే "అట్లు వీలులేదని" వారు సమాధానము చెప్పియుందురు.

## పరిశుద్ధులకు వ్యతిరేకముగా జరుగు పోరాటము

క్రీస్తు విరోధి విశ్వాసులను హింసించుటను గూర్చి దైవ లేఖనములలో మరికొన్ని భాగములలో చూడవచ్చును

డంబపు మాటలను దేవదూషణలను పలుకు ఒక నోరు దానికి ఇయ్యబడెను. మరియు నలువదిరెండు నెలలు తన కార్యము జరుప నధికారము దానికి ఏర్పాటాయెను. గనుక దేవుని దూషించుటకును, ఆయన నామమును, ఆయన గుడారమును, పరలోకనివాసులను దూషించుటకును అది తన నోరు తెరచెను. మరియు ***పరిశుద్ధులతో యుద్ధముచేయును వారిని జయింపను దానికి అధికారమియ్యబడెను***. ప్రతి వంశముమీదను ప్రతి ప్రజమీదను ఆయా భాషలు మాటలాడువారి మీదను ప్రతి జనము మీదను అధికారము దానికియ్యబడెను (ప్రకటన 13:5-7).

నలుబది రెండు నెలలు క్రీస్తు విరోధి హింసాయుత కార్యములు చేయుటకు అధికారమియ్యబడెను అనగా మూడున్నర సంవత్సర కాలములు. ఏడు సంవత్సరముల మహాశ్రమలో ఈ మహా హింస సరిగా అర్ధభాగము అనగా ఏడు సంవత్సరముల చివరి అర్ధభాగములో ఈ గొప్ప శ్రమ సంభవించవచ్చును. యేసు క్రీస్తు ప్రత్యక్షమయినప్పుడు క్రీస్తు విరోధి అధికారము సంపూర్ణముగా కొట్టివేయబడును గనుక అతనికి పనిచేయుటకు ఈ అధికారమియ్యబడెను. మహాశ్రమ కాలము యొక్క అంత్యమున క్రీస్తు రెండవ రాకడలో క్రీస్తు విరోధితోను, అతని సైన్యములతోను పోరాటము సల్పి వారిని తుదముట్టించును. 42 నెలల అధికారమును గూర్చి అది ఒక విశేషమైన అధికారమని చెప్పవచ్చును. అతడు అధికారమునకు వచ్చిన వెంటనే అంత్య క్రీస్తుకు దేవుని వలన ఇట్టి విశేష అధికారము ఇయ్యబడి ఉండవచ్చును. పనిచేయుటకు ఇట్టి విశేష అధికారమియ్యబడుట అంత్య క్రీస్తు పరిశుద్ధులపై జయము పొందుట కొరకైన కాలమును సూచించును. ఆ విషయమునే మనము దానియేలు గ్రంథములో చదువుచున్నాము.

> ఈ కొమ్ము పరిశుద్ధులతో యుద్ధము చేయుచు వారిని గెలుచునదాయెను. ఆ మహావృద్ధుడు వచ్చి మహోన్నతుని పరిశుద్ధుల

> విషయములో తీర్పు తీర్చువరకు ఆలాగు జరుగును గాని సమయము వచ్చినప్పుడు ఆ పరిశుద్ధులు రాజ్యము నేలుదురను సంగతి నేను గ్రహించితిని. ఆ రాజు మహోన్నతునికి విరోధముగా మాటలాడుచు మహోన్నతుని భక్తులను నలుగగొట్టును, అతడు పండుగ కాలములను న్యాయపద్ధతులను నివారణచేయ బూనుకొనును; ***వారు ఒక కాలము కాలములు అర్ధకాలము అతని వశమున నుంచబడుదురు***. (దానియేలు 7:21-22, 25).

క్రీస్తు విరోధి చేతికి పరిశుద్ధులు అప్పగింపబడుటను గూర్చి దాని ముందుగానే "ఒక కాలము, కాలములు, మరియు ఒక అర్ధ కాలం" ఈ వచన భావమును ఈలాగు అర్ధము చేసుకొనవచ్చును. మూడు సంవత్సరములు మరియు ఒక అర్ధ సంవత్సరము దానిని ప్రకటన గ్రంథములో 12వ అధ్యాయము 6వ వచనము మరియు 14వ వచనముతో సరిపోల్చ వచ్చును. ప్రకటన 12:6లో సూచనాత్మకమైన ఒక స్త్రీ అరణ్యములో ఒక మరుగు ప్రదేశములో పన్నెండు వందల అరవై (1260) దినములు అనగా మూడున్నర సంవత్సరముల కాలము దాచబడి యుండెను. ఎనిమిది వచనముల తర్వాత ఆమెను గూర్చి మరలా వ్రాయబడెను. అరణ్యములో ఆమె "పోషించబడుటకు" ఒక మరుగు స్థలములో "ఒక కాలము, కాలములు మరియు అర్ధకాలములు" ఆమెకియ్యబడెనని మరలా వ్రాయబడెను. ఈ కాలము, కాలములు మరియు అర్ధకాలము 1260 దినములు అనగా మూడున్నర సంవత్సరము కాలము.

ఈ సందర్భములో కాలము అనునది ఒక ***సంవత్సరమనియు*** కాలములు **రెండు *సంవత్సరములు*** అనియు అర్ధకాలము ***అర్ధ సంవత్సర*** మరియు అర్థము చేసుకొనవచ్చును. ప్రకటన 12:14లో మనకు కనిపించు ఈ అసాధారణమైన వ్యక్తీకరణ దానియేలు 7:21లో ఉన్న మాటలకు సరిపోవుచున్నవి, అనగా మూడున్నర సంవత్సరముల కాలము క్రీస్తు విరోధి చేతులకు పరిశుద్ధులు అప్పగింపబడెదరు. ప్రకటన 13:5లో కూడా దీనికి సమానమైన కాలము క్రీస్తు విరోధికి విశేష అధికారము పనిచేయుటకు ఇవ్వబడియున్నదని గ్రహింతుము.

ఈ నలువది రెండు నెలల కాలము ఒక దానితో ఒకటి సరిసమానముగా ఈ రెండు వాక్య భాగములలో ప్రస్తావించబడి ఉన్నది. ఏడు సంవత్సరాల మహాశ్రమల మధ్య కాలములో క్రీస్తు విరోధి తన దైవత్వమును గూర్చిన ప్రకటన చేయుటతో ఈ కాలము ప్రారంభమగును. అప్పుడు పరిశుద్ధులు మూడున్నర సంవత్సరం పాటు క్రీస్తు విరోధి చేతులకు మహా శ్రమ కొరకు అప్పగింపబడుదురు మరియు క్రీస్తు ఆకాశమందు ప్రత్యక్షుడై పరిశుద్ధులను క్రీస్తు విరోధి చేతుల నుండి రక్షించి వారిని తన దగ్గరకు చేర్చుకొని అది వెంటనే గాని లేక మూడున్నర సంవత్సరముల శ్రమ అనంతరము గాని ప్రభువు ఆలాగు చేయవచ్చును. ఏది ఎట్లున్నను నలువది రెండు నెలల కాలము ఏడు సంవత్సరముల మహా శ్రమ కాలములో ఎప్పుడు సంభవించినను క్రీస్తు రాకడ కూడా ఈ ఏడు సంవత్సరముల శ్రమ కాలములో ఎప్పుడో ఒకప్పుడు సంభవించును.

ఈ రెండు అవకాశములలో రెండవ అవకాశమును అనుసరించి క్రీస్తు విరోధి చేతులకు పరిశుద్ధులు అప్పగించబడెడి ప్రమాదములో వారుండిరి గనుక తన దేవత్వమును క్రీస్తు విరోధి ప్రకటించుకొనిన వెంటనే వారు కొండలకు పారిపోవలెను. ఇది కొంత అసంధర్భముగా కనబడుచున్నది.

అయితే మొదటి అవకాశమును గూర్చిన ఇబ్బంది ఏమనగా పరిశుద్ధులు ఇంకను భూమి మీదనే ఉందురు. ప్రకటన గ్రంథములో మనము చదువు భయంకరమైన తెగుళ్ళు, ఉపద్రవములు జరుగునప్పుడు కూడా వారు భూమి మీదనే ఉందురని చదువుచున్నాము.

ఇప్పుడు మనము యేసు ప్రభువు ఒలీవల కొండపై చేసిన బోధను గమనించుదుము.

## అబద్ధ మెస్సీయ

అబద్ధ క్రీస్తులను గూర్చి మోసపోవద్దని యేసు తన శిష్యులకు స్పష్టమైన హెచ్చరిక తెలియజేసియున్నాడు.

> ఆ కాలమందు ఎవడైనను- ఇదిగో క్రీస్తు ఇక్కడ ఉన్నాడు, అక్కడ ఉన్నాడు అని చెప్పినయెడల నమ్మకుడి. అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను కనబరచెదరు. ఇదిగో ముందుగా నేను మీతో చెప్పియున్నాను. కాబట్టి ఎవరైనను-ఇదిగో అరణ్యములో ఉన్నాడని మీతో చెప్పినను వెళ్ళకుడి - ఇదిగో లోపలి గదిలో ఉన్నాడని చెప్పినను నమ్మకుడి. మెరుపు తూర్పున పుట్టి పడమటివరకు ఏలాగు కనబడునో అలాగే మనుష్యకుమారుని రాకడయు నుండును. పీనుగు ఎక్కడ ఉన్నదో అక్కడ గద్దలు పోగవును (మత్తయి 24:23-28).

అనేక పర్యాయములు యేసు నీవు లేక మీరు అను వ్యక్తిగత సర్వనామమును ఉపయోగించియున్నాడు. ఒలీవల కొండపై ఆయన ఉపదేశము వినువారు అనేక మంది అబద్ధ క్రీస్తులు మోసపుచ్చు ప్రవక్తలు ఎన్నో గొప్ప వింతలు, అద్భుతములు చేయుట వారు చూచెదరు. మెరుపు వలె మధ్యాకాశము నుండి యేసు దిగివచ్చుట కూడా ఈ బోధ వినువారు చూచెదరు.

అబద్ధ క్రీస్తులు, అబద్ధ ప్రవక్తలు విశ్వాసులను మోసపుచ్చి వారిని బహు విధములుగా ఒప్పింప చూచెదరు మరియు మహాశ్రమ చాలా తీవ్రమైనదిగా ఉండుటను బట్టి విశ్వాసులు విశ్వాస భ్రష్టులై పడిపోవుట చాలా ప్రమాదకరము. అబద్ధ క్రీస్తులు, అబద్ధ ప్రవక్తలు విశ్వాసులును ఒప్పించుటకు ఎన్నో అద్భుత క్రియలు, సూచక క్రియలు చేయుదురు. అందువలననే అనేక పర్యాయములు యేసు తన శిష్యులను ఈ అబద్ధ క్రీస్తును గూర్చి అబద్ధ ప్రవక్తలను గూర్చి జాగ్రత్తగా ఉండవలసినది అని హెచ్చరించెను. తాను రెండవసారి తిరిగి రాకపూర్వము ఇట్టివి

సంభవించునని తెలియజేసెను. అనేకులు తప్పిపోయినట్లుగా తన శిష్యులు తప్పిపోకూడదని యేసు కోరెను. నిజము తెలుసుకొని విశ్వాసమందు నిలకడగా ఉన్నవారు ఆకాశమునుండి మెరుపువలె యేసు వచ్చునని ఎదురు చూచుచుందురు. అయితే ఆయన నిజ విశ్వాసులు కాక యదార్థముగా వెంబడింపని వారు ఈ మోసపుచ్చు క్రీస్తు అబద్ధ ప్రవక్తలు చేయు అద్భుత క్రియలు చూచి వారివైపు ఆకర్షితులై మృత కళేబరముల మీద గ్రద్దలు రాబందులు ఎలాగు ఎగురుచు వాటి మీద వచ్చునో అలాగుననే నిజవిశ్వాసులు కాని వారు అబద్ధ క్రీస్తుల బోధలలోనికి పోవుదురు.

## ఆకాశమందు సూచనలు

యేసు వారికి బోధించుచు,

ఆ దినముల శ్రమ ముగిసిన వెంటనే చీకటి సూర్యుని కమ్మును, చంద్రుడు కాంతిని ఇయ్యడు, ఆకాశమునుండి నక్షత్రములు రాలును, ఆకాశమందలి శక్తులు కదలింపబడును. అప్పుడు మనుష్యకుమారుని సూచన ఆకాశమందు కనబడును. అప్పుడు మనుష్యకుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచి, భూమిమీదనున్న సకల గోత్రములవారు రొమ్ము కొట్టుకొందురు. మరియు ఆయన గొప్ప బూరతో తన దూతలను పంపును. వారు ఆకాశము యొక్క ఈ చివరనుండి ఆ చివరవరకు నలుదిక్కుల నుండి ఆయన ఏర్పరచుకొనినవారిని పోగుచేతురు (మత్తయి 24:29-31).

యేసు జీవించు కాలములోని యూదులకు యేసు చెప్పిన ఈ ఒలీవ కొండ మీద, ఆయన చేసిన బోధలోని రూపకాలంకారపు పోలికలను వారు సులభముగా గ్రహించుదురు. ఎందుకనగా ఆ రూపకములు యెషయా మరియు యోవేలు ప్రవక్తల గ్రంథములలో దేవుడు ఈ ప్రపంచము యొక్క అంతమునందు చేయబోవు ఉగ్రతా తీర్పు విషయములకు సరిపోలియున్నవి. “యెహోవా దినము” అను మాట పదే పదే మనము ఈ ప్రవక్తల గ్రంథములో చూతుము. సూర్యుడు చంద్రుడు చీకటి కమ్మునట్లు నలుపాయెనని (యెషయా 13:10-11; యోవేలు 2:31)లో చూస్తాము. అప్పుడు యేసు ఆకాశమేఘారురుడై మహా మహిమతో వచ్చుట వారు చూచి భూమియందలి నివాసులందరు గొప్ప ఏడ్పు రోదనముచేయుదురు. “ఆ మూల నుండి ఈ మూల వరకు ఆకాశమండలములో యేసును కలుసుకొనుటకు ఆయనచేత ఎన్నుకొనబడినవారు వాయువ్య మండలముల మీద పైకి తీసుకొని పోబడెదరు,” ఇదంతయు “గొప్ప బూర” శబ్ధము పిమ్మట జరుగును.

మరియు ఒలీవ కొండమీద యేసు చేసిన బోధను బట్టి పేతురు, యాకోబు, యోహానులను క్రీస్తు విరోధి మహా శ్రమలు భూమి మీద ప్రారంభించిన కాలములో యేసు రాకడ శ్రమలకు ముందు జరుగునా? అని వారిని అడిగి యుండిన యెడల వారు నిస్సందేహంగా “శ్రమల అనంతరమే” అని చెప్పియుందురు.

## ప్రభువు తిరిగి వచ్చుట మరియు సంఘము పైకెత్తబడుట

ఒలీవ కొండ మీద యేసు బోధ చాలా వరకు పౌలు వ్రాసిన మొదటి థెస్సలోనికయ

పత్రిక 4:13-5:3లో ఉన్న భాగమునకు సమానముగా కనిపించును. ఈ భాగములో సంఘము పైకెత్తబడుటయు మరియు ఇది మహా శ్రమలకు పూర్వమే సంభవించునని అనేక మంది వ్యాఖ్యాన కర్తలు భావింతురు. ఈ లేఖన భాగమును స్పష్టముగా మరియొక సారి గమనించుదము

> సహోదరులారా, నిరీక్షణలేని యితరులవలె మీరు దు:ఖపడకుండు నిమిత్తము, నిద్రించుచున్నవారిని గూర్చి మీకు తెలియకుండుట మాకిష్టములేదు. యేసు మృతి పొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించినవారిని దేవుడాయనతోకూడ వెంటబెట్టుకొని వచ్చును. మేము ప్రభువుమాటను బట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడవరకు ***సజీవులమై నిలిచియుండు*** మనము నిద్రించినవారికంటే ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను ***పరలోకమునుండి ప్రభువు దిగివచ్చును***, క్రీస్తునందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము ***వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండల మునకు మేఘముల మీద కొనిపోబడుదుము***. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము. కాబట్టి మీరు ఈ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి...సహోదరులారా, ఆ కాలములనుగూర్చియు ఆ సమయములను గూర్చియు మీకు వ్రాయనక్కరలేదు. రాత్రి వేళ దొంగ ఏలాగు వచ్చునో అలాగే ప్రభువు దినము వచ్చునని మీకు బాగుగా తెలియును. లోకులు, నెమ్మదిగా ఉన్నది, భయమేమియులేదని చెప్పుకొనుచుండగా, గర్భిణి స్త్రీకి ప్రసవవేదన వచ్చునట్లు వారికి ఆకస్మికముగా నాశనము తటస్థించును గనుక వారెంత మాత్రమును తప్పించుకొనలేరు (1 థెస్స 4:13-18; 5:1-3).

దేవుని బూరతోను పరలోకము నుండి యేసు దిగివచ్చెనని పౌలు వ్రాయుచు విశ్వాసులు ఏకముగా కూర్చబడి మేఘముల మీద "ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు కొనిపోబడుదురు" మత్తయి సువార్త 24:30,31లో యేసు బోధించిన బోధను అనుసరించియే పౌలు యొక్క వ్రాతలు కనిపించుచున్నవి. ఇందులో స్పష్టమైన విషయమేమనగా అంత్యక్రీస్తు అధికారియై లేవక మునుపును మరియు మహాశ్రమ సంభవింపక మునుపును సంఘము పైకెత్తబడుట జరుగును అనునది.

క్రీస్తు రాకడ గూర్చి పౌలు వ్రాయుచు ఇది ఎప్పుడు సంభవించునో ఆ కాలమును గూర్చి కూడా వ్రాయుచున్నాడు. కల్పనా కథలు విరివిగా విను కాలములో ఇది సంభవించునని పౌలు ప్రస్తావించి యున్నాడు. "ప్రభువు దినము రాత్రి వేళ వచ్చు దొంగవలె ఉండునని" తన

పాతకులను హెచ్చరించుచున్నాడు. ప్రభువు వచ్చుట, సంఘము పైకెత్తబడుట ఈ రెండును ఒకే సన్నివేశములో జరుగునని పౌలు నమ్ముచున్నాడు. అంతయు "నెమ్మదిగాను సురక్షితముగాను" ఉన్నదని జనులు అనుకొనుచున్నప్పుడు అకస్మాత్తుగా భూమి అంతటి మీదకు దేవుని ఉగ్రత, నాశనము ఒకేసారి పడును. ఎందుకనగా భూమి మీద ఆయన ఉగ్రత కుమ్మరించబడి తాను ఏర్పరచుకొనిని తనక సంఘమును తనతో కూడా తీసుకొని వెళ్ళుటకు వచ్చును.

పౌలు అటు పిమ్మట థెస్సలోనీకయులకు వ్రాసిన రెండవ ఉత్తరము దానిని క్రీస్తు దైవోగ్రతను చూపుటకు తిరిగివచ్చునని తెలియజేయుటకు కూడా పై సందేశమునకు పొందికగా ఉన్నది.

> ప్రభువైన యేసు తన ప్రభావమును కనుపరచు దూతలతో కూడ పరలోకమునుండి అగ్నిజ్వాలలో ప్రత్యక్షమై, దేవుని నెరుగనివారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునప్పుడు మిమ్మును శ్రమపరచు వారికి శ్రమయు, శ్రమపొందుచున్న మీకు మాతోకూడా విశ్రాంతియు అనుగ్రహించుట దేవునికి న్యాయమే. ఆ దినమున తన పరిశుద్ధులయందు మహిమపరచబడుటకును, విశ్వసించిన వారందరియందు ప్రశంసింపబడుటకును, ప్రభువు వచ్చినప్పుడు అట్టివారు ఆయన సముఖము నుండియు ఆయన ప్రభావమందలి మహిమనుండియు పారదోలబడి, నిత్యనాశనమును దండన పొందుదురు. ఏలయనగా మేము మీకిచ్చిన సాక్ష్యము మీరు నమ్మితిరి(2 థెస్స 1:6-10).

థెస్సలోనికయ క్రైస్తవులు హింసింప బడుచుండగా వారి ఆదరణ కొరకు యేసు రాకడను గూర్చి పౌలు వ్రాస్తు "అగ్నిజ్వాలతో మహా శక్తివంతమైన దూతలతో ఆయన ప్రత్యక్షమగునని పౌలు వ్రాసెను" ఎవరైతే విశ్వాసులను హింసించిరో వారిని బాధ పర్చుటకు ప్రభువు దిగివచ్చునని తెలియజేయుచున్నాడు. ఈ ఉగ్రత రాక ప్రభువు విశ్వాసులకు ఆదరణ కలిగించు రాకకు ముందుగా జరుగునని కొందరు కష్టముగా ఉన్నను ఆలాగు గ్రహించిరి. యేసు రాకడలో మొదటి భాగము రహస్య రాకడగా చెప్పబడుతోంది, ఆయన నిశబ్ధముగా ఆయన తన సంఘమును పైకి తీసుకొని వెళ్ళును. అయితే ఆయన రెండవ భాగము అనగా ఉగ్రత రాకడ ఏడేండ్ల శ్రమల కాలమునకు ముందు సంఘము పైకెత్తబడును మత్తయి 24:30-31లో యేసు బోధించిన దానివలె ఉన్నను వాస్తవమునకు ఇది సరికాదు. ఆయన రాకడ మహా శ్రమల కాలము చివరన తన విశ్వాసులను వెంట బెట్టుకొని తీసుకొని వెళ్ళి అటుపిమ్మట అవిశ్వాసులైన భక్తిహీనుల మీదకి ఆయన తన ఉగ్రత కుమ్మరించును.

## ప్రభువు దినం

పౌలు అదే పత్రికలో ఈలాగు వ్రాసెను:

> సహోదరులారా, ***ప్రభువు దిన***మిప్పుడే వచ్చియున్నట్టుగా ఆత్మ వలననైనను, మాటవలననైనను, మా యొద్దనుండి వచ్చినదని చెప్పిన పత్రికవలననైనను, ఎవడైనను చెప్పినయెడల మీరు త్వరపడి చంచలమనస్కులు కాకుండవలెననియు, బెదరకుండవలెననియు, ***మన ప్రభువైన యేసుక్రీస్తు రాకడనుబట్టియు, మనము ఆయనయొద్ద కూడుకొనుటనుబట్టియు***, మిమ్మును వేడుకొనుచున్నాము (2 థెస్స 2:1-2).

పౌలు యొక్క మొదటి అంశము తిరిగి వచ్చుట మరియు సంఘము ఎత్తబడుట. ఆయన యొద్దకు సంఘము ఏకముగా సమకూర్చబడుట అనుదానిని గూర్చి పౌలు వ్రాసెను. యేసు మత్తయి 24:31లో ఏ మాటలు ఉపయోగించెనో అవే మాటలు పౌలు కూడా వ్రాయుచున్నాడు. "ఆకాశము యొక్క ఈ దిక్కునుండి ఆ దిక్కునకు" ఆయన ఏర్పరచుకొనిన వారిని దూతలు ఏకముగా "సమకూర్చుదురు" అనుదానిని గూర్చి పౌలు కూడా వ్రాసెను.

రెండవది ఈ సంభవములన్నియు "ప్రభువు యొక్క దినము" అను దానితో సమముగా చేసి వ్రాసెను. 1 థెస్స 4:13-5:2లో తాను వ్రాసినది ప్రభువు బోధకు అనుగుణముగానే వ్రాసెను. అది అంత స్పష్టముగా ఉండలేదు.

పౌలు ఇలా కొనసాగించాడు,

> ***మొదట భ్రష్టత్వము సంభవించి నాశన పాత్రుడగు పాపపురుషుడు బయలుపడితేనే గాని ఆ దినము రాదు***. ఏది దేవుడనబడునో, ఏది పూజింపబడునో, దానినంతటిని ఎదిరించుచు, దానికంతటికి పైగా వాడు తన్నుతానే హెచ్చించుకొనుచు, తాను దేవుడనని తన్ను కనుపరచుకొనుచు, దేవుని ఆలయములో కూర్చుండును గనుక ఏవిధముగానైనను ఎవడును మిమ్మును మోసపరచ నియ్యకుడి (2 థెస్స 2:3-4).

ప్రభువు దినమును గూర్చి థెస్సలోనీకయ క్రైస్తవులు తప్పు బోధలలోనికి నడిపించబడుచుండిరి. పౌలు ఉద్దేశ్యం ప్రకారం సంఘం పైకెత్తబడుట క్రీస్తు తిరిగి వచ్చుట అప్పటికే జరిగియున్నదని వారు తలంచుచున్నారని పౌలు భావించెను. అయితే దానిని స్పష్టము చేయుచు 'భ్రష్టత్వము' సంభవిస్తే గాని దానికి ముందు ప్రభువు వచ్చుట గాని, సంఘము పైకెత్తబడుట గాని జరుగదని పౌలు వ్రాసెను. ( ఈ భ్రష్టత్వము అనునది మత్తయి 24:10లో యేసు చెప్పిన అనేకులు విశ్వాసమందు పడిపోవుట అనుదానికి సమానమైయున్నది) మరియు క్రీస్తు విరోధి తన దైవత్వమును గూర్చి యెరూషలేము దేవాలయములో ప్రకటించుకొనిన తరువాత ఇది సంభవించవచ్చును. అందుచేత పౌలు థెస్సలోనీ విశ్వాసులకు వ్రాయుచు క్రీస్తు వచ్చుట గాని, సంఘము పైకెత్తబడుట గాని లేక ప్రభువు దినము గాని క్రీస్తు విరోధి తన దైవత్వమును

గూర్చి ప్రకటించుట తరువాతనే గాని అంతకు మునుపు కాదు.[77]

క్రీస్తు తిరిగి వచ్చుటను గూర్చి మరియు తదనంతరము క్రీస్తు విరోధిని సర్వనాశనము చేయుటను గూర్చి పౌలు వివరించుచున్నాడు:

> నేనింకను మీయొద్ద ఉన్నప్పుడు ఈ సంగతులను మీతో చెప్పినది మీకు జ్ఞాపకములేదా? కాగా వాడు తన సొంతకాలమందు బయలుపరచ బడవలెనని వానిని అడ్డగించునది ఏదో అది మీరెరుగుదురు. ధర్మవిరోధ సంబంధమైన మర్మము ఇప్పటికే క్రియచేయుచున్నది గాని, యిదివరకు అడ్డగించుచున్నవాడు మధ్యనుండి తీసి వేయబడువరకే అడ్డగించును. అప్పుడా ధర్మవిరోధి బయలుపరచబడును. ప్రభువైన యేసు తన నోటియూపిరి చేత వానిని సంహరించి తన ఆగమన ప్రకాశముచేత నాశనముచేయును. నశించుచున్న వారు తాము రక్షింపబడుటకై సత్యవిషయమైన ప్రేమను అవలంబింపక పోయిరి గనుక, వాని రాక అబద్ధ విషయమైన సమస్త బలముతోను, నానావిధములైన సూచక క్రియలతోను, మహత్కార్యములతోను దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్నవారిలో సాతాను కనుపరచు బలమునను అనుసరించియుండును. (2 థెస్స 2:5-10).

ప్రభువు రాకడ వలన క్రీస్తు విరోధి తన కార్య కలాపములకు ఒక అంతము ఏర్పడునని పౌలు ఉద్ఘాటించుచున్నాడు. ప్రభువు ప్రత్యక్షత వలన 2:1లో చెప్పబడినట్లు సంఘము పైకెత్తబడుటకు వచ్చు ప్రత్యక్షత ఇప్పుడు ప్రస్తావించబడిన ప్రత్యక్షత ఒకటే అయిన యెడల సంఘము పైకెత్తబడగానే క్రీస్తు విరోధి నాశనము చేయబడవలయును దీనికి సమముగా ప్రకటన గ్రంథములో 19, 20 అధ్యాయములోని సంఘటనలు సరిపోల్చబడి ఉన్నవి. అందువలన ప్రకటన (19:11-16)లో క్రీస్తు రెండవ రాకడను గూర్చియు (19:15-21)లో క్రీస్తు విరోధి అతని సేనలు నాశనము చేయబడుటయు (20:1,3) వచనములలో సాతాను బంధించబడుటను గూర్చియు మరియు (20:4-6) ఏడేండ్ల శ్రమ కాలములో హతసాక్షులైన విశ్వాసులు తిరిగి బ్రతికింపబడి మొదటి పునరుత్థానములో పాలు పొందుటయు చదివెదము. ఒకవేళ ఇదియే నిజముగా మొదటి పునరుత్థానము అయ్యుండినయెడల నీతి మంతుల సాధారణ పునరుత్థానము ఇదియే కావలెను. అప్పుడు సంఘము పైకెత్తబడుట, క్రీస్తు ఉగ్రత రాకడ గూర్చిన సందేహము అతి తక్కువగా నుండి అదే సమయములో క్రీస్తు విరోధి నాశనము చేయబడుటను గూర్చియు

[77] యేసు ఒలీవ కొండ ప్రసంగం కేవలము యూదులైన విశ్వాసులు శ్రమల కాలములో మారుమనస్సు నూతన జన్మ పొందిన వారి మనస్సులో ఉన్న సందేహముల చీకటులు తొలగిపోయి వెలిగించబడునట్లుగా ఈ సిద్ధాంతము కలదు. శ్రమలకు ముందుగానే మారుమనస్సు పొంది ప్రభువు నందు తిరిగి జన్మించిన వారు ఇప్పటికే వారు పైకెత్తబడి యుండిరి. కాని పౌలు వారికిట్లు చెప్పుట లేదు. అన్యులైన థెస్సలోనీకయ విశ్వాసులు సంఘము పైకెత్తబడుటయు ప్రభువు వచ్చుటయు క్రీస్తు విరోధి తానే దేవుడనని ప్రకటించుకొనిన సమయముననే జరుగును గాని అంతకు మునుపు జరుగదు. ఇది మహాశ్రమల కాలములో మధ్య భాగములో జరుగును.

సంభవింపవలెను. దేవుని లేఖనములు చెప్పునట్లు క్రీస్తునందు మృతి చెందిన వారందరు సంఘము పైకెత్తబడిన సందర్భములోనే శరీర పునరుత్థానము పొందుదురు (1 థెస్స 4:15-17).[78]

## సిద్ధపడి ఉండుట

ఒలీవల కొండ మీద యేసు ప్రసంగమును మరియొక సారి చూచెదము:

అంజూరపు చెట్టును చూచి ఒక ఉపమానము నేర్చుకొనుడి. అంజూరపు కొమ్మ లేతదై చిగిరించునప్పుడు వసంత కాలము యింక సమీపముగా ఉన్నదని మీకు తెలియును. ఆ ప్రకారమే మీరీ సంగతులన్నియు జరుగుట చూచునప్పుడు ఆయన సమీపముననే, ద్వారముదగ్గరనే యున్నాడని తెలిసికొనుడి.[79] ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు (మత్తయి 24:32-35).

తన శిష్యులు అజాగ్రత్తగా ఉండకూడదని యేసు భావించెను. ఈ ఒలీవ కొండ మీది ప్రసంగం ముఖ్య ఉద్దేశ్యము అదియే. "ఆయన వాకిటనే నిలిచి యున్నాడని శిష్యులు తెలుసుకొనవలసి యున్నది" అయితే ఈ సంగతులు జరుగుట ఆరంభించబడునప్పుడు "వారు చూచినపుడు" ప్రపంచ వ్యాప్తంగా ఈ మహాశ్రమ, భ్రష్టత్వము అనేక మంది అబద్ధ ప్రవక్తలు మోసపుచ్చు క్రీస్తులు పైకి లేతురు. క్రీస్తు విరోధి తానే దేవుడనని ప్రకటించుకొనిన తరువాత కాలాంతపు సూచనలైన సూర్యుడు చంద్రుడు నలుపెక్కుట నక్షత్రములు రాలిపోవుట ప్రభువు రాకకు సమీపమాయెనని తెలుసుకొందురు.

ఆయన రాత ఎప్పుడో ఆ సంవత్సరములు గాని, ఆ నెలలుగాని, ఆ దినములు గాని వాటి సూచనలు గాని ప్రత్యక్షముగా తెలియజెప్పక ఖచ్చితముగా ఆయన ఎప్పుడు వచ్చునో అది మరుగు చేయబడిన ఒక మర్మముగా ఉన్నదని వారితో చెప్పెను. "ఆ దినమైనను, ఆ గడియైనను ఎవ్వరు ఎరుగకుందురు. పరలోకమందలి దూతలు గాని తండ్రి తప్ప కుమారుడైనను ఎరుగడు:

> అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియనుగూర్చియు తండ్రి మాత్రమే (యెరుగును) గాని, యే మనుష్యుడైనను పరలోకమందలి దూతలైనను కుమారుడైనను ఎరుగరు (మత్తయి 24:36).

---

[78] ప్రకటన 20:4-6లో చెప్పబడిన పునరుత్థానమును గూర్చి కొందరు చెప్పునది ఏమనగా వాస్తవమునకు ఇది మొదటి పునరుత్థానములోని 2వ భాగము సంఘము క్రీస్తు మొదటి రాకడలో ఎత్తబడినప్పుడు ఈ పునరుత్థానము సంభవించును. ఈ వాక్యమునకు సహేతుకమైన ఆధారమేది? ప్రకటన 20:4-6 లో పునరుత్థానము ఒకవేళ వాస్తముగా రెండవ పునరుత్థానమైన యెడల అది ఎందుచేత రెండవ పునరుత్థానమని పిలువబడుచున్నది.

[79] ఒలీవల కొండ మీది యేసు చెప్పిన సంగతులన్నియు వినిన వారందరు ఆ సంగతులన్నియు తమ తరములోనే సంభవించెనని వారనుకొనిరి. అయితే ఆలాగు జరుగలేదని మనము ఎరుగుదము. ఈ సంగతులన్నియు జరుగక మునుపు ఈ తరము గతింపదని ఆయన చెప్పిన మాటలకు అర్థము (మత్తయి 24:34). ఇవి ఏదో ఒక కాలము ఒక తరములో ఒక జాతి యొక్క కాలములో జరుగునని అనుకొనరాదు. క్రైస్తవులైనను, యూదులైనను ఇవి జరుగుట చూతురు.

లేఖన భాగమునకు వేరుగా ఎన్నో పర్యాయములు తప్పుగా అర్థము చేసుకొనబడుచు ఉన్నవి. యేసు ఎప్పుడు వచ్చునో అను దానికి ఖచ్చితమైన **అభిప్రాయము** మన మెవ్వరమూ చెప్పజాలము. సంఘము పైకెత్తబడుటకు ముందు ఎప్పుడో ఒకప్పుడు తప్పక ఆయన వచ్చును. యేసు మాటల భావమును ఈ వచనము అంత స్పష్టముగా లేదు. యేసు తిరిగి వచ్చుటకు ముందు ఏమేమి సూచనలు జరుగునో వాటిని తన శిష్యులు తెలిసికొని ముందుగా సిద్ధపడ వలసి యున్నది. ఆయన ఎప్పుడు వచ్చునో, ఆ గడియ గాని, ఆ దినము గాని అది మరుగుపరచబడెను. ఏడేండ్ల మహా శ్రమకు ముందు ఆయన రాకడ సంభవించునని ఈ వాక్యభాగములో ఎక్కడనుయేసు చూపుట లేదు. సంఘము ఒకవేళ రహస్యముగా పైకెత్తబడవచ్చును. ప్రభువు తిరిగి వచ్చుట శ్రమల యొక్క చివరి కాలములో జరుగ వచ్చును. ఏది ఏమైనను ఇది బహు మర్మముగా ఉంచబడిన సంగతి గనుక అంత స్పష్టముగా దీనిని వివరింప జాలదు.

## ఆయన రాకడ - ఒక సంపూర్ణమైన ఆశ్చర్యము

ప్రభువు రాకను గూర్చి ఒక వివాదము లేక తర్కము జరుపబడుచున్నది. సంఘము పైకెత్తబడుట అనునది మహా శ్రమకు ప్రారంభములో గాని లేక అంత్యములో గాని జరుగవచ్చును గనుక ఇది గొప్ప ఆశ్చర్యకరమైన విషయముగా భావించవచ్చును. మహా శ్రమల కాలములో సంభవించు సూచనలను బట్టి ఆయన ఆగమనము ఎదురు చూడవచ్చును. కొందరు చెప్పునది శ్రమలకు ముందే సంఘము పైకెత్తబడునని లేఖనము చెప్పునట్లుగా విశ్వాసులు సంసిద్ధత కలిగి యుండుట ఆవశ్యము. అది ఏడేండ్ల ముందు కావచ్చును లేక పిమ్మట కావచ్చును. ఎప్పుడైనను విశ్వాసులు సిద్ధపడి ఉండవలెను.

యేసు ఒలీవల కొండ ప్రసంగము తన శిష్యులు సిద్ధపడి యుండుట ఆవశ్యము. ప్రభువు రాక శ్రమలకు ముందో, శ్రమల తరువాతనో అను విషయము ఒక అభ్యంతరముగా ఉండకుండా అనేకమైన సూచనలను యేసు వారికి ఆయన రాకకు ముందు జరుగునని బయలు పరచి ఉండెను. యేసు ఆయన రాకడ బహు దీర్ఘ కాలము పట్టునని ఎరిగియుండి ఎందుకు ఆయన శిష్యులను ఎన్నో హెచ్చరికలతో వారిని జాగ్రత్తగా ఉండవలెయునని ఉపదేశించెను? ***ప్రభువు రాకడ ఎంత కాలమైనప్పటికి క్రీస్తు విశ్వాసులు సిద్ధపడి ఉండుట ఎంతో ఆవశ్యకము***. అపొస్తలులు కూడా వారి పత్రికలలో ప్రభువు రాకను గూర్చి ఎన్నో హెచ్చరికలు విశ్వాసులకు తెలియపరిచి యున్నారు.

ప్రభువు రాకడకు సిద్ధపడి ఎల్లప్పుడును ఎదురుచూచుచుండవలెనని ఉద్ఘాటించిరి. శ్రమలకు ముందు సంఘము పైకెత్తబడుటను గూర్చి విశ్వసించు వారు ఈ హెచ్చరికలను గైకొని సిద్ధపడి ఉండుట యందు కూడా ఒక సమస్య కలదు. ఏడేండ్ల శ్రమల కాలములో అంత్య భాగమున క్రీస్తు రాకడ సంభవించునని వారు భావించుచున్నారు. అందువలన యేసు యొక్క రాకడలోని ప్రథమ భాగము ఏడేండ్ల శ్రమకాలమునకు ముందు జరుగునను తలంపు కలదు. వాస్తవమునకు ప్రపంచములో యేసు రాకడకు ముందు జరుగవలసిన వన్నియు

శ్రమలకు ముందు గానే జరుగును. అటిపిమ్మటనే ప్రభువు రాకడ వచ్చునని ఆ సూచనలను బట్టి గ్రహించవచ్చును.

నేటి ప్రపంచ రాజకీయ పరిస్థితులను గమనించునప్పుడు నేడో రేపో యేసుని రాకడ సంభవించునని వారు చెప్పుచు కొందరు శ్రమలకు పూర్వమే సంఘములు పైకెత్తబడునని భావించుచుండిరి. ఏడేండ్ల శ్రమ కాలము ప్రారంభమగుటకు ముందు గానే ప్రవచింపబడిన అనేక సంగతులు అవి సంపూర్తిగా నెరవేర్చబడవలెను. ఉదా: దానియేలు గ్రంథములో చెప్పబడినట్లు క్రీస్తు విరోధి ఇశ్రాయేలు వారితో ఏడేండ్ల కొరకు నిబంధన ఒకటి చేసుకొనును, అదే శ్రమలకు ప్రారంభ సూచకము. ఇశ్రాయేలులో 7 సంవత్సరముల ఒడంబడిక ప్రకారము 7 సం॥ల శ్రమ కాలమునకు ముందుగానే సంఘము పైకెత్తబడును. ప్రపంచ రాజకీయ పరిస్థితులలో ప్రభువు రాకడకు క్రీస్తు విరోధి పరిపాలనకు అనుకూలమైన రంగము సిద్ధము చేయబడును. అందువలన శ్రమలకు ముందుగానే సంఘము పైకెత్తబడుట అనుదానిని గూర్చి అంత అవసరత కనిపించదు. ఈ సంగతులను నమ్మువారు క్రీస్తు వచ్చుట సంఘము పైకెత్తబడుట శ్రమల అంతమందు జరుగునని నమ్ముదురు.

దానిని బట్టి క్రీస్తు రెండవ రాకడ ఎప్పుడు జరుగునో గుణించుటకు అవకాశము ఏర్పడును. యేసు చెప్పినట్లు ప్రభువు రాకడ సమయము కేవలము తండ్రి మాత్రమే ఎరుగును. అప్పుడు సంఘము పైకెత్తబడుట ఏడేండ్ల శ్రమకాలము ఎప్పుడు జరుగునో గమనించుటకు అవకాశము ఏర్పడును.

తన రాకడను గూర్చి తన శిష్యులు ఏ మాత్రమును ఆశ్చర్యపడనక్కర లేదని యేసు తన శిష్యులతో చెప్పెను. శ్రమల కాలమునకు ముందు సంభవించు సూచనలను బట్టి వారు తెలుసుకొనవలెనని యేసు కోరెను. ప్రపంచములోని సాధారణ జనులు ఆశ్చర్యపడునట్లు తన శిష్యులు ఈ సంగతులేమి ఎరుగని వారై ఉండకూడదు గాని వారు సమస్తమును ఎరిగిన వారై ఆశ్చర్యపడక నిబ్బరముగా ఉండవలెను. అందుచేతనే ఆ ఒలీవలకొండ ప్రసంగములో యేసు ఇట్లు చెప్పెను

> నోవహు దినములు ఏలాగుండెనో మనుష్యకుమారుని రాకడయును అలాగే ఉండును. జలప్రళయమునకు ముందటి దినములలో నోవాహు ఓడలోనికి వెళ్ళిన దినమువరకు, వారు తినుచు త్రాగుచు పెండ్లి చేసికొనుచు పెండ్లికిచ్చుచునుండి జలప్రళయమువచ్చి అందరిని కొట్టుకొనిపోవువరకు ఎరుగక పోయిరి; ఆలాగుననే మనుష్యకుమారుని రాకడ ఉండును. ఆ కాలమున ఇద్దరు పొలములో ఉందురు, ఒకడు తీసికొనిపోబడును ఒకడు, విడిచిపెట్టబడును. ఇద్దరు స్త్రీలు తిరుగలి విసరుచుందురు. ఒకతె తీసికొని పోబడును, ఒకతె విడిచిపెట్టబడును.[80] కావున ఏ దినమున మీ ప్రభువు వచ్చునో మీకు

[80] ఒకరు విడిచిపెట్టబడుట, మరొకరు పైకెత్తబడుట అను విషయము (తరువాయి భాగం పక్క పేజీ లో చూడుము)

తెలియదు గనుక మెలకువగా నుండుడి. ఏ జామున దొంగవచ్చునో యింటి యజమానునికి తెలిసియుండిన యెడల అతడు మెలకువగా ఉండి తన యింటికి కన్నము వేయనియ్యడని మీరెరుగుదురు. మీరనుకొనని గడియలో మనుష్యకుమారుడు వచ్చును. గనుకనే మీరును సిద్ధముగా ఉండుడి (మత్తయి 24:37-44).

తన ఆగమనము కొరకు తన శిష్యులు ఎల్లప్పుడు సిద్ధపడి ఉండవలెనన్నది యేసు ఉద్దేశ్యమైయున్నది. ఈ ఒలీవ కొండ ప్రసంగం అంతటి యొక్క ఉద్దేశ్యం వారు ఎల్లప్పుడు సిద్ధపడి ఉండవలెననునదియే. ఎందుకనగా ఆయన రాకముందు జరుగు మహా కఠినమైన శ్రమదినములు సంభవించినప్పుడు వారు ఆశ్చర్యపడ నవసరం లేకుండా వారు ఎల్లప్పుడును సిద్ధముగా ఉండి జరుగబోవు వాటినెల్లను తప్పించుకొనునట్లు మెలకువగా ఉండి బహు జాగ్రత్త గలవారై ఉండవలెనని యేసు వారికి ముందుగానే హెచ్చరించెను. ఇది ఇలా ఉండగా,ఏ వేళనైన ఆయన వచ్చుననియు శ్రమలకు ముందే సంఘము పైకెత్తబడుననియు భావించువారు మిగతా క్రైస్తవులకంటే వారు ఎక్కువ సంసిద్ధపడి ఉండవలెను. ఒకవేళ వారు సిద్ధపడక అజాగ్రత్తగా ఉండిన యెడల అకస్మాత్తుగా ఈ మహా శ్రమలను గూర్చి ఎరుగక ఉండినట్లయితే ప్రపంచ వ్యాప్తముగా వచ్చు ఘోర హింసలకును క్రీస్తు విరోధి పరిపాలనలోని శ్రమలకును ఆ శోధనలకు తట్టుకొన లేక వారు పడిపోవుదురు. గనుక లేఖనము ఏమి చెబుతున్నదో అది తప్పక జరుగునని నమ్మి ముందుగానే సిద్ధపడి ఉండుట ఎంతైనా ఆవశ్యకము.

ఈ సంగతులను గూర్చి ఒకవేళ పేతురు, యాకోబు, యోహానులను యేసు ఎప్పుడు వచ్చునని ప్రశ్నించి ఉండినట్లయితే, వారు తమకు యేసు చెప్పిన సూచనలన్నీ ఆయన రాకడకు ముందు జరుగవలసి ఉందని ఆతరువాతే ఆయన రాకడ ఉంటుందని చెప్పి ఉండేవారు. అయితే క్రీస్తు విరోధి ఆధికారమును గూర్చిగాని, మహా శ్రమలను గూర్చిగాని ఆయన రాకకు ముందు ఇవి జరుగునని వారు ఎదురు చూచుట లేదు.

## రాత్రివేళ వచ్చు దొంగ

యేసు తన రాకడను గురించి బయలుపరచిన అనేక విషయాలలో చివరికి "రాత్రివేళ దొంగవలె" వచ్చును అని తన రాకడ గురించి చెప్పిన పోలికను ఆయన శిష్యులు గ్రహించలేక పోయారు. కనుక యేసు ఎప్పుడు తిరగిరానైయున్నాడో అన్నది ఎవ్వరూ ఊహించలేరు అన్నది రుజువుచేయుటకు "రాత్రి వేళ దొంగవలె" అనెడి పోలికను ఉపయోగించకూడదు.

పౌలు మరియు పేతురు ఇరువురు "ప్రభువు దినమును" గురించి వ్రాస్తున్నప్పుడు యేసు "రాత్రి వేళ దొంగవలె వచ్చును" అన్న పోలికను వాడారు (1 థెస్స 5:2-4, 2 పేతురు

---

చర్చించ బడుచుండగా ఈ ఉదాహరణలో ఏ వ్యక్తి అయితే తీర్పు శిక్ష కింద ఉంచబడతాడు లేక ఎవరు శిక్ష నుండి తప్పించబడి పైకెత్తబడునో అనునది అంత వ్యత్యాసము కనపరచు విషయము కాదు కాని ముఖ్యమైన అంశము ఏదనగా క్రీస్తు రాకడకు ఎందరు సిద్ధపడి యుండిరి, సిద్ధము లేకుండా యుండిరి అనునదే ప్రాముఖ్యము. వారి నిత్యత్వము యొక్క పరమావధి వారు చేసుకొనిన సిద్ధపాటును అనుసరించి ఉండును.

3:10 చూడుము). ఆ పోలిక ఏడు సంవత్సరముల శ్రమలకాలము అంతములో రాబోయే యేసు యొక్క ఉగ్రత రాకడకు వర్తిస్తుందని భావించారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, పౌలు తన పాఠకులకు, "సహోదరులారా, ఈ దినము దొంగవలె మీమీదకి వచ్చుటకు మీరు చీకటిలో ఉన్నవారు కారు" (1 థెస్స 5:4) అని వ్రాసాడు. అతను, ఎవరైతే యేసును విధేయతతో వెంబడిస్తూ ఆయన చెప్పిన సూచనలను జాగ్రత్తగా గమనిస్తూ సిద్ధపడి ఉంటారో అటువంటి వారు చీకటిలో ఉండరు, కాబట్టి యేసు రాకడ వారిని ఆశ్చర్యచకితులను చేయదని చెబుతూ యేసు చెప్పిన పోలికను సరియైన రీతిలో చక్కగా వివరించాడు. వారి యెడల యేసు రాత్రివేళ దొంగవలె వచ్చును అన్న పోలిక వర్తించదు. కేవలం చీకటిలో ఉన్న వారికి మాత్రమే ఆయన రాకడ విస్మయం కలిగిస్తుంది, ఇదే విషయాన్ని యేసు కూడా బోధించింది. (ప్రకటన 3:3 మరియు 16:15 లలో చెప్పబడిన "రాత్రి వేళ దొంగవలె" అన్న పోలికను ఆర్మగడ్డులో తాను చేయబోయే యుద్ధమును సూచిస్తు దానిని ఉపయోగించాడు).

ఒలీవల కొండమీది ప్రసంగంలో ఈ విషయం చెప్పటం ఆరంభించినప్పటి నుండి యేసు తన రాకడ గురించి సిద్ధంగా ఉండమని తన శిష్యులను పదే పదే హెచ్చరిస్తూ వచ్చాడు. అదే సమయంలో విశ్వసఘాతకుడైన పనివాడు, పదిమంది కన్యకల ఉపమానములను చెబుతూ మరియు మేకలకు మరియు గొఱ్ఱెలకు జరగబోవు తీర్పును ముందుగానే చెబుతూ (ఇవన్నియు చదువదగినవి) ఆవిధంగా ఆయన తన శిష్యులు ఏవిధంగా సిద్ధంగా ఉండాలో అన్నది కూడ బోధిస్తూ వచ్చాడు. దాదాపు ప్రతి సందర్భంలో ఆయన తన రాకడ గురించి సిద్ధంగా ఉండని వారి కొరకు నరకం కాచుకొని ఉందని హెచ్చరిస్తూ వచ్చాడు (మత్తయి 24:50-51, 25:30, 41-46 చూడుము). సిద్ధంగా ఉండటం అంటే ఆయన వచ్చినప్పుడు దేవుని చిత్త ప్రకారం నడుచుకొనే వారిని ఆయన కనుగొనటము.[81]

## మరొక అభ్యంతరము

రాప్చర్ అనునది దగ్గరలో కాని లేక శ్రమల కాలము చివరలో కాని ఉండును అన్న దానికి కొంత మంది అభ్యంతరము తెలుపుతున్నారు. అనగా వారు నోవహు, లోతు మరియు ఐగుప్తులోని ఇశ్రాయేలీయులను ఉదాహరణగా తీసుకొని నిరూపిస్తూ నీతిమంతులు అనీతిమంతులతో పాటు శిక్షణను ఎదుర్కొనరు అని బైబిలును ఆధారము చేసుకొని వాదిస్తూ ఉంటారు.

నీతిపరులు ఏడు సంవత్సరముల శ్రమలకాలములో దేవుని ఉగ్రతను చవిచూడరని నమ్ముటకు వాస్తవంగా మనకు మంచి కారణం ఉన్నది, అది అనేకమైన బైబిలు ప్రమాణాలకు

[81] వాస్తవంగా యేసు అతని దగ్గర వున్న శిష్యులతో తన రాకడ సమయంలో వారు సిద్ధంగా ఉండకపోవచ్చేమో అని హెచ్చరించాడంటే వారు సిద్ధంగా ఉండకపోవచ్చనే అవకాశం ఉంది. వారు, పాపమువలన సిద్ధంగా ఉండకపోతే నిత్యమరణమనే శిక్ష పొందుతారని యేసు హెచ్చరించాడంటే, పాపము వలన వారి రక్షణ పోగొట్టుకొనటానికి అవకాశము ఉన్నట్లు భావించవచ్చు. కావున ఇది పరిశుద్ధత యొక్క ప్రాముఖ్యతను మనకు చెబుతోంది, మరియు కొంతమంది విశ్వాసులు ఒక్కసారి రక్షణ పొందితే ఇక దానిని పోగొట్టుకోలేము అని అనుకుంటుంటారు. వారి నమ్మకం తప్పని తెలుసుకుంటున్నాం.

మరియు దృష్టాంతములకు వ్యరిరేకముగా ఉన్నది (ఉదాహరణకు 1 థెస్స 1:9-10, 5:8 చూడుము).

యేసు ఆ మహా శ్రమల కాలము గురించి చెబుతూ నీతిమంతులు ఆ సమయములో చాలా శ్రమలు ఎదుర్కొంటారని ముందుగానే చెప్పాడు. అది దేవుని చేతిలో కాక, అనీతిమంతుల చేతిలో ఉన్నది. క్రైస్తవులు ఆ శ్రమలనుండి తప్పించబడరు, వాస్తవంగా ఆ శ్రమలను వారు ఎదుర్కొంటారని వాగ్దానం చేయబడింది. ఆ ఏడు సంవత్సరాల శ్రమల కాలంలో అనేకమంది విశ్వాసులు తమ ప్రాణాలు కోల్పోతారు (మత్తయి 24:9; ప్రకటన 6:9-11, 13:15; 16:5-6; 17:6; 18:24; 19:2 చూడుము). అనేకమంది శిరచ్ఛేదము చేయబడుదురు (ప్రకటన 20:4 చూడుము).

ఒకవేళ ఏ దేశములోనైన ఎవరైన ఒక విశ్వాసి హతసాక్షి గావించబడినప్పుడు, ఆ దేశమంతటిమీదికి రాబోవు దేవుని ఉగ్రతను ఆపటం ఎవరి తరమూ కాదు. ఏదైన ఒక దేశములోని దుష్టుల మీదికి దేవుని ఉగ్రత తీర్పు రాబోతున్నప్పుడు ఆ దేశములో ఉన్న తన విశ్వాసులను ఆయన కాపాడుకోగలడు. మోషే కాలములో ఐగుప్తులో ఆయన ఉగ్రత తీర్పు ఆ దేశము మీదికి వచ్చినప్పుడు, ఆయన అది చేసి నిరూపించాడు. అయన కనీసం ఒక కుక్క కూడా ఇశ్రాయేలీయులను చూచి మొరగనివ్వ కుండా చేసెను. అదేవిధంగా భూమిమీద ఉన్న దుష్టజనులను 5 నెలల పాటు బాధించుటకు కొండ్లు కలిగిన మిడతలను అనుమతించిన వైనం మనం ప్రకటన గ్రంథములో చదువుతాము, అవి దుష్టులను బాధిస్తున్నప్పటికీ తమ నొసళ్ళయందు దేవుని ప్రత్యేక ముద్రగల 144,000 మంది దేవుని దాసులైన యూదులకు హానిచేయుటకు అనుమతింపబడలేదు (ప్రకటన 9:1-11 చూడుము).

## ప్రకటన గ్రంథములో చెప్పబడిన రాప్చర్

ప్రకటన గ్రంథములో ఎక్కడా కూడా సంఘం ఎత్తబడటం గురించి వ్రాసి ఉండటం మనం చదవం మరియు 19వ అధ్యాయంలో ఆయన క్రీస్తు విరోధిని అతని సైన్యాన్ని ఆర్మగడ్డ యుద్ధములో వధించడం తప్ప మరి ఎక్కడా కూడా ఆయన ప్రత్యక్షత గురించి మనం చదవం. అప్పటికి కూడా రాప్చర్ సంభవిస్తుంది అని వ్రాయబడలేదు. కాని అదే కాలపరిమితిలో (20:4 చూడుము) శ్రమల కాలంలో చనిపోయిన హతసాక్షులు పునరుత్థానం చెందుతారని వ్రాయబడింది. యేసు రాకడ సమయంలో క్రీస్తునందు నిద్రించిన వారు తిరిగి లేస్తారని అదేసమయంలో సంఘం ఎత్తబడుతుందని పౌలు వ్రాసాడు. ఇది ఇతర లేఖనభాగములతో కలిపి మనం ఇదివరకే చదివాము కనుక ఏడు సంఘాల శ్రమల కాలం పూర్తి అయ్యేవరకు సంఘం ఎత్తబడదని మనం నమ్ముటకు ఇది దోహదపడుతోంది. ఇది ప్రకటన 19 మరియు 20 అధ్యాయాల్లో వివరించబడింది.

అయితే మరికొందరి అభిప్రాయాలు కూడా మనం పరిశీలిద్దాము:

కొంతమంది ప్రకటన 6 మరియు 7 అధ్యాయాల్లో తాము సంఘం ఎత్తబడుటను గూర్చి చదివాము అని చెబుతారు. (మత్తయి 24:29-31)లో యేసు తన ప్రత్యక్షతకు మరియు

తాము ఏర్పరచుకొన్న వారిని పోగుచేయక ముందు జరగబోయే రెండు సూచనలను గురించి చెప్పాడు. అవే సూచనలు ప్రకటన 6:12-13లో, సూర్యుడు "కంబళివలె నలుపాయెను" అనియు, ఆకాశం నుండి నక్షత్రములు రాలుననియు, మనం చూస్తాం కదా అని చెబుతుంటారు. తరువాత వెంటనే 7వ అధ్యాయంలో ప్రతి జనములో నుండియు, ప్రతి వంశములో నుండియు ప్రజలలో నుండియు ఆయా భాషలు మాటలాడు వారిలో నుండియు గొప్పజన సమూహము పరలోకములో ఉండుటను మనం చదువుతాము. వీరంతా "మహా శ్రమల నుండి వచ్చినవారు" దీనికి ముందు అధ్యాయం (6:9-11 చూడుము)లో చెప్పబడిన గుంపు వలె వీరు హతసాక్షులు అయినవారు అని చెప్పబడలేదు,కావున ఆ మహాశ్రమల నుండి కాపాడబడిన విశ్వాసులు హత్య గావించబడక, ఎత్తబడి ఉంటారు అని భావించుటకు ఇది మనకు దోహదపడుతోంది.

యేసు మత్తయి 24:29-31లో చెప్పినాడు కాబట్టి, ప్రకటన 6:12-13లో వర్ణించబడిన అంతరిక్ష సంఘటనలు తరువాత వెంటనే సంఘం ఎత్తబడుతుంది అని నమ్ముటకు ఇది సముచితముగా ఉన్నది. ఏడు సంవత్సరాల శ్రమల కాలంలో ఈ ప్రకటన 6:12-13లో చెప్పబడిన అంతరిక్ష మార్పులు ఎప్పుడు సంభవిస్తాయి అన్నది మనకు ఖచ్చితంగా తెలుపబడలేదు. ప్రకటన 6:1-13లో వర్ణించబడిన విశేషాలు ఒకవేళ ఒకటి తరువాత ఒకటిగా జరుగబోవుచున్నట్లయితే మరియు 6:13లో చెప్పబడిన సంగతుల తర్వాత వెంటనే సంఘం ఎత్తబడుతున్నట్లయితే, ఇప్పుడు చెప్పబోయేవన్నీ జరిగేవరకు రాప్చర్ జరగదని మనం విశ్వసించటానికి ఇది దోహదపడుతుంది, అవి ఏవనగా, అంత్య క్రీస్తు రాకడకు ముందు (6:1-2 చూడుము), ప్రపంచవ్యాప్తముగా జరిగే యుద్ధం (6:3-4 చూడుము), కరవు (6:5-6 చూడుము), యుద్ధం, కరవు, తెగుళ్ళు, అడవిజంతువుల ద్వారా భూమిమీద ఉన్న నాలుగు వంతుల జనులు చనిపోయిన తరువాత (ప్రకటన 6:7-8 చూడుము), మరియు అనేక మంది హత సాక్షులు అయినతరువాత (6:9:11 చూడుము) సంఘం ఎత్తబడుతుంది. ఇప్పుడు చెప్పబడిన సంఘటనలు అన్నియు శ్రమల కాలం అవక***ముందే*** జరుగుతాయి, కాని ఈ లేఖనములు అన్నియు ఏడు సంవత్సరముల శ్రమల కాలంను వర్ణిస్తున్నాయి, అంతములో రాప్చర్ గురించి చెబుతున్నాయి.

ఏడు సంవత్సరాల అంతమునకు ***ముందు*** రాప్చర్ జరుగుతుందన్న అభిప్రాయానికి ఇంకొంచెం బలం చేకూర్చటానికి, ప్రకటన 8వ అధ్యాయంలో చెప్పబడిన ఏడు తీర్పులు కలిగిన రెండు భాగాలు మనకు తెలుపుతున్నాయి: అవి ఏవనగా, "బూర తీర్పులు" మరియొకటి "పాత్రల తీర్పులు." ఈ రెండిటిలో ఆఖరున చెప్పబడినదానితో దేవుని ఉగ్రత సమాప్తమవుతుంది అని చెప్పబడుతోంది (15:1 చూడుము). ఈ "పాత్ర తీర్పులు" మొదలు పెట్టక ముందు, యోహాను "మరియు అగ్నితో కలిసియున్న స్ఫటికపు సముద్రము వంటిది ఒకటి నేను చూచితిని. ఆ క్రూరమృగమునకును దాని ప్రతిమకును దాని పేరుగల సంఖ్యకును లోబడక వాటిని జయించిన వారు దేవుని వీణెలుగలవారై ఆ స్ఫటికపు సముద్రమునొద్ద నిలిచియుండుట చూచితిని" (15:2). ఈ విజయం పొందిన పరిశుద్ధులు రాప్చర్ అయివుండవచ్చు, లేదా చంపబడి

ఉండవచ్చు, లేఖనం ఏదీ మనకు చెప్పటం లేదు. అంతకు ముందు వర్ణించబడిన విషయాలలో ఈ 15:2లో చెప్పబడిన దానితో ఏదైన సంబంధం కలిగి ఉందో లేదో మనకు తెలియదు.

ఏడు సంవత్సరముల అంతమునకు ముందే రాప్చర్ జరుగును అన్న అభిప్రాయాన్ని బలపరిచే మరొక సత్యం ప్రకటన గ్రంథములోనే చూడగలము: ప్రకటన 9:1-12లో చెప్పబడిన అయిదవ "బూర తీర్పు" జరిగిన సందర్భములో కొండ్లు గలిగిన మిడతలు కేవలం "దేవుని ముద్ర తమ నొసటన కలిగి ఉండని వారికి మాత్రమే" హాని చేయుటకు అనుమతించబడ్డాయి (9:4). దేవుని ముద్ర కలిగిన వారు అని ఎవరిగురించి అయితే చెప్పబడిందో వారు 144,000 మంది ఇశ్రాయేలు సంతతికి చెందిన వారు (ప్రకటన 7:3-8 చూడుము). దానిని బట్టి తక్కిన విశ్వాసులందరూ అయిదవ "బూర తీర్పు" జరగకముందే ఎత్తబడవలసి ఉంటుంది అన్నట్లు అగుపడుతోంది. లేనిచో వారు కొండ్లు కలిగిన మిడతల నుండి తప్పించబడలేరు. ఇంకా చెప్పాలంటే, ఈ మిడతలు ప్రజల్ని అయిదు నెలల వరకు బాధించుటకు వాటికి అధికారము ఇయ్యబడెను (9:5, 10), ఏడుసంవత్సరముల శ్రమల కాలం ముగిస్తుంది అనగా దానికి 5 నెలలకు ముందు ఈ రాప్చర్ సంభవించవచ్చును అని అనుకోవటానికి ఆస్కారముంది.

ఈ ఆలోచనకు వేరే మార్గాలు కూడా ఉన్నాయి. బహుశా కొందరు ముద్రను కలిగి ప్రకటనలో క్లుప్తంగా తమ గురించి ప్రస్తావించబడక ఉండని వారు ఉంటారు. రాప్చర్ అయిదవ బూరకు ముందు సంభవిస్తుందని నిరూపించదలచుకుంటే, ఈ కొండీలు కలిగిన మిడతలు విడుదల కాకముందు కొంతమంది అనగా ప్రత్యేకమైన ముద్రగల 144,000 మంది ఇశ్రాయేలు సంతతికి చెందిన వారు, ఎత్తబడరు అని కూడా లేఖనం చెబుతోంది. కాని దేవుని ఉగ్రత ఈ కొండ్లు కలిగిన మిడతల రూపములో వచ్చినప్పుడు వారు వాటి నుండి సంరక్షింపబడతారు.

అయితే వీటన్నిటి భావం ఏమిటి? నా అభిప్రాయం ప్రకారం రాప్చర్ అనునది ఏడు సంవత్సరముల శ్రమలు ***ముగింపులో*** లేక అంతమునకు ***దగ్గర్లో*** జరుగవచ్చును. విశ్వాసులు దేవుని ఉగ్రతకులోనవుతారని భయపడనక్కరలేదు, కాని తీవ్రమైన హింసలకు మరియు చంపబడుటకు సిద్ధంగా ఉండాల్సివుంటుంది.

## శ్రమల కాలం

ఏడు సంవత్సర శ్రమల కాలం గురించి లేఖనం ఏమని బోధిస్తున్నదో కొన్ని క్షణాలు జాగ్రత్తగా గమనిద్దాము. ఈ శ్రమల కాలము ఏడు సంవత్సరములు ఉంటుందని మనం ఏ విధంగా లెక్కించగలుగుతున్నాము? మనము ప్రకటన గ్రంథముతో పాటు, అంత్య దినాల గురించి ఎన్నో విషయాలను వెల్లడిచేస్తున్న దానియేలు గ్రంథమును కూడా మనము చదవాలి.

దానియేలు గ్రంథములోని 9వ అధ్యాయంలో దానియేలు మరియు అతని తోటి స్నేహితులైన యూదులు బబులోనులో ఖైదీలుగా ఉన్నారని చదువుతాము. యిర్మియా గ్రంథం చదువుతున్నప్పుడు బబులోనులో యూదులు 70 సంవత్సరములు చెరలో ఉంటారని అతను తెలుసుకున్నాడు (దానియేలు 9:2; యిర్మియా 25:11-12). అది చదివాక ఇక ఈ డెబ్బది

సంవత్సరాల కాలం దాదాపు ముగింపబోతున్నదని గ్రహించి, దానియేలు తన జనుల పక్షమున వారి పాపములు క్షమించమని దయను చూపించమని ప్రార్థించటం ప్రారంభించాడు. తన ప్రార్థనకు జవాబుగా గాబ్రియేలు దూత అతనికి కనిపించి, ఇశ్రాయేలీయుల యెడల శ్రమల కాలం నుంచి క్రీస్తు రాకడ వరకు జరుగబోవు సంగతులను అతనికి బయలుపరచెను. దానియేలు (9:24-27)లో ఉన్న ప్రవచనం లేఖనములోని అద్భుతమైన ప్రవచనములలో ఒకటియైయున్నది. దీనిని నేను క్రింద నా వ్యాఖ్యానములతో సహా వివరిస్తున్నాను.

> తిరుగుబాటును మాన్పుటకును (తమ సొంత మెస్సీయను సిలువవేయటం **బహుశా** ఇశ్రాయేలీయుల పాపములకు పరాకాష్ట అని చెప్పవచ్చు) పాపమును నివారణ చేయుటకును (**బహుశా** సిలువ మీద క్రీస్తుయొక్క విమోచన కార్యమునకు ఇది ఒక సూచన అయి ఉండవచ్చును) దోషము నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుటకును (సిలువ మీద యేసు చేసిన విమోచన కార్యమును ఇది సూచిస్తున్నది అనుటలో ***సందేహమేలేదు***), యుగాంతము వరకుండునట్టి నీతిని బయలు పరచుటకును (యేసు ఈ భూమి మీద తన పరిపాలన ప్రారంభించుట), దర్శనమును, ప్రవచనమును ముద్రించుటకును (**బహుశా** లేఖనము వ్రాయుటను గురించిన ముగింపును లేక వేయి సంవత్సరముల పరిపాలనకు ముందు ఉన్న ప్రవచనము లన్నిటినీ నెరవేర్చటానికి ఇది సూచన), అతి పరిశుద్ధ స్థలమును అభిషేకించుటకును (బహుశా వేయి సంవత్సరాలలో దేవాలయమును స్థాపించుటకు ఇది ఒక సూచన అయివుండవచ్చును), నీ జనమునకును ఇశ్రాయేలీయుల పరిశుద్ధపట్టణమునకును (యెరూషలేము) డెబ్బది వారములు (ఇవి మనం చూడబోతున్నట్లుగా సంవత్సరాలలోని వారాలు లేదా మొత్తం 490 సంవత్సరాలు) విధింపబడెను. యెరూషలేమును మరల కట్టించవచ్చునని (అర్టెజెక్స్ (Artaxerxes) అనెడి రాజు ఆజ్ఞను 445 B.C లో జారీ చేసాడు), ఆజ్ఞ బయలుదేరిన సమయము మొదలుకొని అభిషిక్తుడగు అధిపతి (ప్రభువైన యేసుక్రీస్తు) వచ్చువరకు ఏడు వారములు పట్టునని స్పష్టముగా గ్రహించుము. అరువది రెండు వారములు (అనగా మొత్తం 69 వారములు, లేక 483 సంవత్సరములు) తొందరగల సమయమందు పట్టణపు రాచవీధులును, కందకములును మరల కట్టబడును (అనగా మునుపు బబులోనీయుల ద్వార నాశనము చేయబడిన యెరూషలేము మరలా కట్టబడుట). ఈ అరువది రెండు వారములు జరిగిన పిమ్మట (అనగా 445B.C లో ఆజ్ఞ జారీ

చేయబడిన 483 సంవత్సరముల తర్వాత), ఏమియు లేకుండా అభిషిక్తుడు నిర్మూలము చేయబడును (సంవత్సరానికి 360రోజుల చొప్పున ఉండెడి యూదుల క్యాలెండరు ప్రకారం లెక్కిస్తే యేసు 32A.D లో సిలువవేయబడతాడు). వచ్చునట్టి రాజు (అంత్య క్రీస్తు) యొక్క ప్రజలు (రోమీయులు) పవిత్రపట్టణమును, పరిశుద్ధ ఆలయమును నశింపచేయుదురు (తీతుకు మరియు రోమీయుల దండు 70 A.D లో యెరూషలేమును నాశనం చేయుటను ఇది సూచిస్తున్నది). దాని అంతము హఠాత్తుగా వచ్చును; మరియు యుద్ధ కాలాంతము వరకు నాశనము జరుగునని నిర్ణయింపబడెను. అతడు ("వచ్చునట్టి రాజు" - అంత్య క్రీస్తు) ***ఒక వారమునకు*** అనేకులకు (ఇశ్రాయేలీయులు) నిబంధనను స్థిరపరచును( లేదా 7 సంవత్సరములు - ఇది శ్రమల కాలము), అర్ధవారమునకు (సుమారు మూడున్నర సంవత్సరం) బలిని నైవేద్యమును నిలిపివేయును; హేయమైనది నిలుచువరకు (అంత్య క్రీస్తు యెరూషలేములో యూదుల దేవాలయములో కూర్చుని తనకు తాను దేవుడని ప్రకటించు కుంటున్నప్పుడు; 2 థెస్స 2:1-4 చూడుము) నాశనము చేయువాడు వచ్చును (యేసు తిరిగి వచ్చును) నాశనముచేయువానికి రావలెనని నిర్ణయించిన నాశనము ముగించువరకు ఈలాగున జరుగును (యేసు అంత్యక్రీస్తును ఓడించటం) (దానియేలు 9:24-27).

## 490 ప్రత్యేకమైన సంవత్సరములు

యెరూషలేము మరల కట్టుటకు ఆర్టెజెక్స్ (Artaxerxes) అనెడి రాజు 445B.C లో ఆజ్ఞను జారీచేసినప్పటినుండి దేవుడు 490 ప్రత్యేక సంవత్సరాలు భవిష్యత్ చరిత్ర కొరకు ఇచ్చాడు. కాని ఆ 490 సంవత్సరములు అనుక్రమముగా ఏర్పరచబడలేదు; దాని బదులు అవి రెండు భాగాలుగా విభజింపబడ్డాయి, అందులో ఒకటి 483 సంవత్సరములు మరియొకటి 7 సంవత్సరములు. కేటాయించబడిన ఈ మొదటి 483 సం॥లు గడిచిపోయినతరువాత (యేసుని సిలువ వేసిన సంవత్సరములో) గడియారం ఆగిపోయింది. ఈ గడియారం దాదాపు రెండువేల సం॥ల వరకు ఆగిపోతుందని బహుశా దానియేలు కలగనివుండడు. భవిష్యత్తులో ఎప్పుడో ఒకసారి ఈ గడియారం మళ్ళీ పనిచేయటం మొదలుపెట్టి చివరి ఏడు సం॥ల వరకు పనిచేస్తుంది. ఆ చివరి ఏడు సంవత్సరములు "శ్రమలు" అని మాత్రమే కాక "దానియేలు యొక్క 70వ వారం" అని చెప్పబడుతోంది.

ఆ యేడు సంవత్సరాలు కూడా ఒక్కొక్కటి మూడున్నర సంవత్సరములుగా రెండు భాగాలుగా విభజింపబడ్డాయి. ఆ ఏడు సం॥ల మధ్యకాలంలో దానియేలు ప్రవచనంలో మనం చదివినట్లు అంత్య క్రీస్తు ఇశ్రాయేలీయులతో చేసిన నిబంధనను అతిక్రమించి "బలిని

నైవేద్యమును నిలిపి వేస్తాడు"అప్పుడతడు పౌలు మనకు చెప్పిన ప్రకారంగా యెరూషలేము దేవాలయములో కూర్చుని నేనే దేవుడనని చెబుతాడు.[82] అదియే యేసు చెప్పిన "నాశనకరమైన హేయవస్తువు" (మత్తయి 24:15 చూడుము). అందుకే యూదయలో ఉన్న విశ్వాసులందరూ "కొండలకు పారిపోవలెను" (మత్తయి 24:16), ఎందుకంటే లోకారంభము నుండి ఇప్పటివరకును అట్టి శ్రమ కలుగలేదు, ఇక ఎప్పుడును కలుగబోదు (మత్తయి 24:21 చూడుము).

ప్రకటన గ్రంథములోని 12వ అధ్యాయములో వ్రాసిన "యూదయనుండి పారిపోవటమును" బహుశా యోహాను తన దర్శనములో చూసి ఉండవచ్చు. ఒకవేళ అదే జరిగినచో యూదయలో ఉన్న విశ్వాసులు వారికి ఒక ప్రత్యేకమైన సురక్షిత స్థలము అరణ్యములో సిద్ధం చేయబడి ఉందని తెలుసుకుంటారు. అక్కడ వారు ఏడు సంవత్సరాల శ్రమల కాలంలోని మిగిలిన 3 1/2 సం॥ కాలంపాటు "పోషించబడతారు" (ప్రకటన 12:6, 13-17). యోహాను తన దర్శనములో, సాతాను వారు పారిపోయినందుకు ఆగ్రహం తెచ్చుకోవటం మరియు శేషించిన వారు ఎవరైతే "దేవుని ఆజ్ఞలు గైకొనుచు యేసును గూర్చి సాక్ష్యమిస్తున్నారో" వారితో యుద్ధానికి బయలు దేరటం ఇవన్నియు అతను ముందే చూసాడు (ప్రకటన 12:17). అందుకనే అంత్య క్రీస్తు యెరూషలేములో తాను దేవుడని ప్రకటించుకొన్నప్పుడు లోకములో ఉన్న విశ్వాసులందరూ సురక్షితంగా ఉండుట కొరకు ఎవ్వరికి తెలియని ఏకాంత స్థలములకు పారిపోవలెను.

## దానియేలుకు ఇవ్వబడిన చివరి దర్శనం

ఇప్పటివరకు మనం పరిశీలించనవి అద్భుతమైన దానియేలు గ్రంథములోని మరొక లేఖనభాగంలోని పదమూడు వచనములలో కనుగొనగలము. ఇవి దూత ద్వారా దానియేలుకు చెప్పబడిన మాటలు, వాటిని నా వ్యాఖ్యానములతో సహా క్రింద వ్రాస్తున్నాను:

ఆ కాలమందు నీ జనుల పక్షమున నిలుచునట్టి మహా అధిపతియగు మిఖాయేలు (దేవదూత) వచ్చును. అప్పుడు నీ జనులు రాజ్యముగా కూడిన కాలం మొదలుకొని ఈ కాలం వరకు ఎన్నటికిని కలుగనంత ఆపద కలుగును. (మత్తయి 24:21లో యేసు మాట్లాడిన శ్రమ ఇదే అయివుండవచ్చు); అయితే నీ జనులలో గ్రంథమునందు దాఖలైన వారెవరో వారు తప్పించుకొందురు (ఇది యూదయ నుండి పారిపోవటం లేదా రాప్చర్ ద్వారా విశ్వాసులు రక్షింపబడటం అన్నదాని గూర్చి చెప్పబడుతున్నది) మరియు సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు; కొందరు నిత్యజీవం అనుభవించుటకును, కొందరు నిందపాలగుటకును, నిత్యముగా హేయమగుటకును (పరిశుద్ధులు మరియు పాపాత్ముల యొక్క పునరుత్థానం) మేలుకొందురు. బుద్ధిమంతులైతే ఆకాశమండలములోని జ్యోతులను పోలినవారై ప్రకాశించెదరు, నీతి మార్గం అనుసరించి నడుచుకొనునట్లు ఎవరు అనేకులను త్రిప్పుదురో వారు నక్షత్రముల వలె నిరంతరము ప్రకాశించెదరు (పునరుత్థానం తరువాత పరిశుద్ధులకి క్రొత్త శరీరములు ఇవ్వబడతాయి అవి దేవుని మహిమలో ప్రకాశిస్తాయి). దానియేలు, నీవు ఈ మాలను మరుగుచేసి

[82] యెరూషలేము దేవాలయము తిరిగి కట్టబడుతుంది అని ఇది మనకు సూచిస్తున్నది. ఈ రోజు వరకు కూడా యెరూషలేములో దేవాలయం లేదు (అనగా 2005లో ఈ పుస్తకం వ్రాయబడిన సంవత్సరం వరకు అన్నమాట).

అసత్య కాలము వరకు ఈ గ్రంథమును ముద్రింపుము. చాలా మంది నలుదిశల సంచరించినందున తెలివి అధికమగును (గత వంద సం॥ల నుంచి రవాణ మరియు జ్ఞానములో అద్భుతమైన అభివృద్ధి కనబడటం చూస్తే ఈ ప్రవచనం నెరవేరుతున్నట్లుగా అగుపడుతోంది) అని నాతో మాటలాడు గబ్రియేలనునతడు చెప్పెను.

దానియేలను నేను చూచుచుండగా మరి ఇద్దరు మనుష్యులు యేటి అవతలి యొడ్డున ఒకడును, ఏటి ఇవతలి యొడ్డున ఒకడును నిలిచిరి. ఆ యిద్దరిలో ఒకడు నారబట్టలు వేసికొన్నవాడై యేటి నీళ్ళపైన ఆడుచుండువాని చూచి, ఈ యాశ్చర్యము ఎప్పుడు సమాప్తమగునని యడుగగా, నారబట్టలు వేసికొని యేటిపైన ఆడుచున్న ఆ మనుష్యుని మాటను నేను వింటిని, ఏమనగా అతడు తన కుడిచేతిని ఎడమ చేతిని ఆకాశము వైపుకెత్తి నిత్యజీవియగు వాని నామమున ఒట్టుపెట్టుకొని ఒక కాలము, కాలములు, అర్ధకాలము (ప్రకటన 12:6 మరియు 12:14లో వివరించబడిన ప్రకారంగా చూస్తే అది మూడున్నర సంవత్సరాలు), పరిశుద్ధ జనము యొక్క బలమును కొట్టి వేయుట ముగింపబడగా సకల సంగతులు సమాప్తములగుననెను (మూడున్నర సంవత్సరముల వరకు అంత్య క్రీస్తు చేతుల్లోకి పరిశుద్ధులు ఇవ్వబడతారని దానియేలు 7:25లో చెప్పబడిన విధంగా ఇక్కడ ఆ యేడు సంవత్సరాల శ్రమలలో ఆఖరి మూడున్నర సంవత్సరాలు అవి అయివుండవచ్చు. దేవదూత చెప్పినట్లుగా ఈ సకల సంగతుల సమాప్తము “పరిశుద్ధ జనము యొక్క బలము కొట్టి వేయబడినప్పుడు” జరుగును). నేను వింటిని గాని గ్రహింపలేక పోతిని - నా యేలినవాడా, వీటికి అంతమేమని నేనడుగగా, అతడు ఈ సంగతులు అంత్యకాలము వరకు మరుగుగా ఉండునట్లు ముద్రింపబడినవి కనుక, దానియేలూ, నీవు ఊరకుండుమని చెప్పెను. అనేకులు తమ్మును శుద్ధిపరచుకొని ప్రకాశమానులును నిర్మలులు అగుదురు (అది నిస్సందేహంగా శ్రమలద్వారానే అయివుంటుంది); దుష్టులు దుష్ట కార్యములు చేయుదురు గనుక ఏ దుష్టుడును ఈ సంగతులను గ్రహింపలేకపోవును గాని బుద్ధిమంతులు గ్రహించెదరు. అనుదినబలి నిలుపు చేయబడిన కాలము మొదలుకొని నాశనము కలుగజేయు హేయమైన దానిని నిలువబెట్టు వరకు వెయ్యిన్ని రెండువందల తొంబది దినములగును (దీనిని ఆ రెండు సంఘటనల మధ్య సమయమని వివరించకూడదు, ఎందుకంటే ఆ రెండు ఈ ఏడు సం॥లు మధ్యన జరుగుతాయి. దాని బదులు ఆ రెండు

సంఘటనలు జరిగిన తరువాత అప్పటినుండి 1,290రోజులకు అంతములో అతి ప్రాముఖ్యమైనది ఒకటి జరుగును అని చెప్పాలి. సంవత్సరమునకు 360 రోజుల లెక్క ప్రకారం చూస్తే ఈ 1,290 రోజులు అనేవి మూడున్నర సంవత్సరముల కంటే 30 రోజులు ఎక్కువ అన గ్రహించవచ్చు. ఈ సంవత్సరమునకు 360 రోజులు అనెడి ఈ కాలం ప్రవచనాత్మక గ్రంథములైన దానియేలు మరియు ప్రకటనలలో తరచూ ప్రస్తావించబడుతున్నది. అదనంగా ఈ 30 రోజులు ఎందుకు కలిపారో అన్నది ఆలోచించవలసిన విషయం. ఈ మర్మాన్ని ఇంకా బలపరచుటకు ఆ దూత దానియేలుతో తర్వాత ఇలాగన్నది:) వెయ్యిన్ని మూడువందల ముప్పది యైదు దినములు తాళుకొని కనిపెట్టుకొనువాడు ధన్యుడు! (ఇప్పుడు ఈ మర్మానికి అదనంగా 45 రోజులు కలపబడ్డాయి). నీవు అంత్యము వరకు నిలకడగా ఉండిన యెడల విశ్రాంతి నొంది (దానియేలుకు వాగ్దానము చేయబడిన పునరుత్థానం) కాలాంతమందు నీ వంతులో నిలిచెదవు" (దానియేలు 12:1-13).

అదనంగా చేర్చబడిన ఆ 75 రోజుల అంతములో ఖచ్చితంగా ఏదో అద్భుతమైన సంగతి జరుగబోతోంది! మనందరం వేచి చూడవలసి ఉంటుంది.

క్రీస్తు రాకడ తరువాత వెంటనే కొన్ని సంఘటనలు జరుగుతాయి అని ప్రకటన ఆఖరి అధ్యాయాలు చదివితే మనం తెలుసుకుంటాం. అందులో ఒకటి గొఱ్ఱెపిల్ల పెళ్ళివిందు, దీని గురించి యోహానుతో ఒక దూత ఏమంటున్నాడంటె, " గొఱ్ఱె పిల్ల పెండ్లి విందుకు పిలువబడిన వారు ధన్యులు" అని చెబుతున్నది (ప్రకటన19:9). బహుశా దానియేలుతో దూత కూడ ఇదే దీవెన గురించి చెప్పివుండవచ్చు. ఒకవేళ అదే గనుక జరిగితే, ఆ మహిమకరమైన విందు యేసు తిరిగి వచ్చిన తరువాత రెండున్నర నెలలకు జరుగుతుంది.

బహుశా ప్రకటన ఆఖరి అధ్యాయాల్లో వ్రాసిన ప్రకారంగా ఈ 75 రోజులు జరగబోయే కొన్ని సంఘటనలు అనగా, అంత్య క్రీస్తును, అబద్ధ ప్రవక్తను, మండుచున్న అగ్నిగుండములోనికి విసిరి వేయుట, సాతాను బంధించుట, మరియు ఈ భూమి మీద యేసు తన రాజ్యాన్ని స్థాపించుట మొ॥ సంఘటనలతో నిండి ఉంటాయి (ప్రకటన 19:20-20:4).

## వెయ్యి సంవత్సరముల పాలన

వెయ్యి సంవత్సరముల పాలన అనగా యేసు తానే స్వయంగా ఈ లోకాన్ని 1000 సం॥ పరిపాలిస్తాడు అని అర్థం (ప్రకటన 20:3,5,7 చూడుము). ఏడు సం॥ల శ్రమల తర్వాత ఇది జరుగుతుంది. మూడు వేల సంవత్సరముల క్రితమే యెషయ ప్రవక్త ఈ భూమిపై యేసు యొక్క పరిపాలనను ముందుగానే చూసాడు:

ఏలయనగా మనకు శిశువు పుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహింపబడెను,

***ఆయన భుజము మీద రాజ్యభారముండును***. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును. ***ఇది మొదలుకొని మితిలేకుండ దానికి వృద్ధియు క్షేమమును*** కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును. న్యాయమువలనను నీతివలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసనాసీనుడై రాజ్యపరిపాలన చేయును (యెషయా 9:6-7).

అదేవిధంగా గబ్రియేలను దూత మరియతో ఆమె కుమారుడు శాశ్విత రాజ్యాన్ని పరిపాలిస్తాడని తెలిపెను:

> దూత - మరియా, భయపడకుము; దేవునివలన నీవు కృపపొందితివి. ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు; ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ***ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతము లేనిదై యుండునని*** ఆమెతో చెప్పెను (లూకా 1:30-33).[83]

ఈవేయి సంవత్సరాలలో యేసు యెరూషలేములోని సీయోను కొండపైనుండి తానే స్వయంగా పరిపాలిస్తాడు. దాని ఎత్తు ప్రస్తుతము కన్నా ఇంకా ఎత్తుగా ఎత్తబడుతుంది. ఆయన పరిపాలనలో అన్ని దేశాలకు పరిపూర్ణమైన న్యాయం అందుతుంది మరియు భూమిమీద అంతట సమాధానం ఉంటుంది.

> అంత్యదినములలో పర్వతములపైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండల కంటె ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్టు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులోనుండి ధర్మశాస్త్రము యెరూషలేములోనుండి యెహోవా వాక్కు బయలువెళ్ళును. జనములు గుంపులు గుంపులుగా వచ్చి - యాకోబు దేవుని మందిరమునకు యెహోవా పర్వతమునకు మనము వెళ్ళుదము రండి ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును మనము ఆయన త్రోవలో నడుతము అని చెప్పుకొందురు.

[83] ప్రవచనాత్మకమైన సంఘటనల గురించి లేఖనము ఏమి చెబుతోందో దానిని గ్రహించక, ఆ సంఘటనల సమయముల గురించి తప్పుగా భావించటమును ఈ లేఖన భాగం ఉదాహరణగా చూపిస్తోంది. కొన్ని సం॥లోనే తన ప్రత్యేక కుమారుడు దావీదు సింహాసనం మీద పరిపాలిస్తాడని మరియమ్మ సులభంగా మరియు న్యాయసమ్మతంగా అనుకొని ఉండవచ్చును యాకోబు సంతతిని పరిపాలించే కుమారుడు ఆమెకు పుడతాడని గబ్రియేలు చెప్పెను. ఇది వింటే యేసు యొక్క జననం మరియు పరిపాలన రెండూ ఒకటి తరువాత ఒకటి జరుగునట్లుగా అనిపిస్తోంది. ఆ రెండిటి మధ్యన కనీసం 2000సం॥ ఉంటుందని మరియమ్మ ఎప్పుడూ ఊహించి ఉండదు. ప్రవచనాత్మకమైన లేఖనములను వివరించునప్పుడు మనము ఇలాటి ఊహాకల్పనలు చేయకుండా జాగ్రత్తపడాలి.

ఆయన మధ్యవర్తియై అన్యజనులకు న్యాయము తీర్చును అనేక జనములకు తీర్పు తీర్చును. వారు తమ ఖడ్గములను నాగటి నక్కులుగాను తమ యీటెలను మచ్చుకత్తులుగాను సాగగొట్టుదురు జనము మీదికి జనము ఖడ్గమెత్తక యుండును యుద్ధముచేయ నేర్చుకొనుట ఇక మానివేయును

## జెకర్యా కూడా ఇదే విషయాన్ని ప్రవచించాడు:

సైన్యములకు అధిపతియగు యెహోవా ఆజ్ఞ ఇచ్చునదేమనగా - మిగుల ఆసక్తితో నేను సీయోను విషయమందు రోషము వహించియున్నాను. బహు రౌద్రముగలవాడనై దాని విషయమందు నేను రోషము వహించియున్నాను. యెహోవా సెలవిచ్చునదేమనగా-నేను సీయోను నొద్దకు మరల వచ్చి, యెరూషలేములో నివాసముచేతును, సత్యమును అనుసరించు పురమనియు, సైన్యములకు అధిపతియగు యెహోవా పర్వతము పరిశుద్ధ పర్వతమనియు పేర్లు పెట్టబడును...సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చునదేమనగా-జనములును అనేక పట్టణపువారి యొద్దకు వచ్చి-ఆలస్యముచేయక యెహోవాను శాంతిపరచుటకును, సైన్యములకు అధిపతియగు యెహోవాను వెదకుటకును మనము పోదము రండి అని చెప్పగా వారు-మేమును వత్తుమందురు. అనేక జనములును బలముగల జనులును యెరూషలేములో సైన్యములకు అధిపతియగు యెహోవాను వెదకుటకును,యెహోవాను శాంతిపరచుటకును వత్తురు. సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చునదేమనగా-ఆ దినములలో ఆయా భాషలు మాటలాడు అన్యజనులలో పదేసిమంది యొక యూదుని చెంగుపట్టుకొని-దేవుడు మీకు తోడుగా ఉన్నాడను సంగతి మీకు వినబడినది గనుక మేము మీతో కూడ వత్తుమని చెప్పుదురు (జెకర్యా 8:2-3, 20-23).

ఆ వెయ్యి సంవత్సర కాలములో క్రీస్తుతో విశ్వాసులు కూడా పరిపాలిస్తారని బైబిలు బోధిస్తున్నది. ఇప్పుడు వారు చూపిస్తున్న విశ్వాసము నమ్మకమును బట్టి ఆయన రాజ్యములో వారికి ఆయా బాధ్యతలు ఇవ్వబడతాయి(దానియేలు 7:27; లూకా 19:12-27; 1 కొరింథీ 6:1-3; ప్రకటన 2:26-27; 5:9-10; మరియు 22:3-5 చూడుము).

అప్పుడు మనము మహిమాశరీరమును ధరించు కుంటాము కాని అదే సమయంలో విడవబడినవారు ఈ మర్త్యమైన శరీరముతో ఈలోకంలో నివసిస్తూ ఉంటారు. ఇంకా చెప్పాలంటే మన పితరులకున్న దీర్ఘాయుష్షు తిరిగి వస్తుంది మరియు అడవిజంతువులు వాటి క్రూరత్వాన్ని

కోల్పోతాయి:

> నేను యెరూషలేమును గూర్చి ఆనందించెదను. నా జనులను గూర్చి హర్షించెదను. రోదనధ్వనియు విలాపధ్వనియు దానిలో ఇకను వినబడవు. అక్కడ ఇకను కొద్దిదినములే బ్రదుకు శిశువులుండరు కాలమునిండని ముసలివారుండరు. బాలురు నూరు సంవత్సరముల వయస్సుగలవారై చనిపోవుదురు. పాపాత్ముడై శాపగ్రస్తుడగువాడు సహితము నూరు సంవత్సరములు బ్రదుకును....తోడేళ్ళును గొఱ్ఱెపిల్లలును కలిసి మేయును. సింహము ఎద్దువలె గడ్డి తినును. సర్పమునకు మన్ను ఆహారమగును. నా పరిశుద్ధపర్వతములో అవి హానియైనను నాశనమైనను చేయకుండును అని యెహోవా సెలవిచ్చుచున్నాడు (యెషయా 65:19-20, 25, మరియు యెషయా 11:6-9 కూడా చూడుము).

బైబిలులో మరిముఖ్యంగా పాతనిబంధనలో రాబోయే వేయిసంవత్సరముల గురించి చాలా చోట్ల చెప్పబడింది. దీని గురించి మరిఎక్కువగా ధ్యానించవలెనంటే ఈ వాక్యములను చదవండి: యెషయా 11:6-16; 25:1-12; 35:1-10; యిర్మీయా 23:1-5; యోవేలు 2:30-3:21; ఆమోసు 9:11-15; మీకా 4:1-7; జెఫన్యా 3:14-20; జెకర్యా 14:9-21 మరియు ప్రకటన 20:1-6.

రాబోయే వెయ్యి సం॥ పాలన గురించి కీర్తనలో అనేక అధ్యాయాలు ప్రవచనాత్మకంగా చెబుతున్నాయి. ఉదాహరణకు ఈ క్రింది కీర్తన అధ్యాయమును చూద్దాము:

> ***మన దేవుని పట్టణమందు ఆయన పరిశుద్ధ పర్వతమందు యెహోవా గొప్పవాడును బహు కీర్తనీయుడునై యున్నాడు. ఉత్తరదిక్కున మహారాజు పట్టణమైన సీయోను పర్వతము రమ్యమైన యెత్తుగల చోట నుంచబడి సర్వభూమికి సంతోషకరముగా నున్నది. దాని నగరులలో దేవుడు ఆశ్రయముగా ప్రత్యక్షమగుచున్నాడు.*** రాజులు కూడిరి వారు ఏకముగా కూడి వచ్చిరి. వారు దాని చూచిన వెంటనే ఆశ్చర్యపడిరి భ్రమపడి త్వరగా వెళ్ళిపోయిరి. వారచ్చటనుండగా వణకును ప్రసవించు స్త్రీ వేదనయు వారిని పట్టెను (కీర్తన 48:1-6).

వేయి సం॥ పరిపాలన మొదలుపెట్టాక యేసు తన పరిపాలనను యెరూషలేములో స్థాపించినప్పుడు శ్రమల కాలములో ఓర్చుకున్న అనేకమంది అధికారులు యేసు రాజ్యపాలన గురించి విని దానిని చూడటానికి ప్రయాణమై వస్తారు. వారు తాము చూసిన దానిని బట్టి ఆశ్చర్యపోతారు [84]

---

[84]మిగత లేఖనములు చూస్తే వెయ్యి సంవత్సరములు ప్రారంభమైనప్పుడు ఈ లోకంలో విశ్వాసులతో పాటు అవిశ్వాసులు కూడా నివసిస్తూ వుంటారు (యెషయ 2:1-5; 60:1-5; దానియేలు 7:13-14).

క్రీస్తు యొక్క వెయ్యి సంవత్సరాల పాలన గురించి సూచించెడి ఇతర కీర్తనలు: కీర్తన 2:1-12; 24:1-10; 47:1-9, 66:1-7; 68:15-17; 99:1-9; మరియు 100:1-5.

## శాశ్వత రాజ్యం

వేదశాస్త్ర పండితులు సెలవిస్తున్నట్లుగా వెయ్యిసంవత్సరాల ముగింపు "శాశ్వత రాజ్యానికి" ఆరంభముగా చెప్పబడుతోంది. ఇది ఒక క్రొత్త పరలోకం మరియు క్రొత్త భూమితో ప్రారంభమవుతుంది. 1కొరింథీ 15:24-28లో చెప్పబడిన ప్రకారం తండ్రియైన దేవునికి యేసు సమస్తమును అప్పగిస్తాడు:

> అటుతరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యమును, సమస్తమైన అధికారమును, బలమును కొట్టివేసి తన తండ్రియైన దేవునికి రాజ్యము అప్పగించును; అప్పుడు అంతము వచ్చును. ఎందుకనగా తన శత్రువులనందరిని తన పాదముల క్రింద ఉంచువరకు ఆయన రాజ్యపరిపాలన చేయుచుండవలెను. కడపట నశింపజేయబడు శత్రువు మరణము. దేవుడు సమస్తమును క్రీస్తు పాదముల క్రింద లోపరచియుంచెను. సమస్తమును లోపరచబడియున్నదని చెప్పినప్పుడు ఆయనకు సమస్తమును లోపరచినవాడు తప్ప సమస్తమును లోపరచబడియున్నదను సంగతి విశదమే. మరియు సమస్తమును ఆయనకు లోపరచడినప్పుడు దేవుడు సర్వములో సర్వమగు నిమిత్తము కుమారుడు తనకు సమస్తమును లోపరచిన దేవునికి తానే లోబడును (1 కొరింథీ 15:24-28).

వేయి సం॥ల కాలములో బంధించబడివున్న సాతాను ఆ వేయిసంవత్సరముల పరిపాలన అంతములో విడుదల చేయబడును. ఎవరైతే పైపైన యేసుకు విధేయత చూపిస్తూ లోపల ఆయన పట్ల వ్యతిరేక భావం కలిగి ఉంటారో, వారిని ఈ సాతాను మోసగిస్తాడు (కీర్తన 66:3 చూడుము).

వారు తమ నిజమైన హృదయ స్థితిని వెల్లడిచేయుటకు దేవుడు సాతానుకు ఆ మనుష్యులను మోసం చేయుటకు అనుమతిస్తాడు. కనుక వారు న్యాయసమ్మతమైన తీర్పును పొందుతారు. అతని మోసంలో పడి పరిశుద్ధ పట్టణమైన యెరూషలేమును దాడిచేయుటకు వారందరూ యేసు యొక్క పరిపాలనను కూలద్రోయటానికి కూడుకుంటారు. ఈ యుద్ధం ఎక్కువ కాలం నిలవదు, ఎందుకంటే పరలోకం నుంచి అగ్ని క్రిందికి వచ్చి ఈ సైన్యమంతటిని దహించివేస్తుంది మరియు సాతానుడు అగ్నిగంధకములుగల గుండములో పడద్రోయబడతాడు (ప్రకటన 20:17-10 చూడుము).

యుద్ధానికి కూడుకోబోయే సమూహము గురించి కీర్తన 2వ అధ్యాయములో ముందే చెప్పబడింది:

> అన్యజనులు ఏల అల్లరి రేపుచున్నారు? జనములు ఏల వ్యర్థమైన

దానిని తలంచుచున్నవి? మనము వారి కట్లు తెంపుదుము రండి
వారి పాశములను మనయొద్దనుండి పారవేయుదము రండి అని
చెప్పుకొనుచు భూరాజులు యెహోవాకును ఆయన అభిషిక్తునికిని
విరోధముగా నిలువబడుచున్నారు. ఏలికలు ఏకీభవించి ఆలోచన
చేయుచున్నారు. ఆకాశమందు ఆసీనుడగువాడు నవ్వుచున్నాడు.
ప్రభువు వారినిచూచి అపహసించు చున్నాడు. ఆయన ఉగ్రుడై వారితో
పలుకును ప్రచండకోపముచేత వారిని తల్లడింపజేయును. నేను నా
పరిశుద్ధ పర్వతమైన సీయోను మీద నా రాజును ఆసీనునిగా
చేసియున్నాను. కట్టడను నేను వివరించెదను. యెహోవా నాకీలాగు
సెలవిచ్చెను. నీవు నా కుమారుడవు నేడు నిన్ను కనియున్నాను. నన్ను
అడుగుము, జనములను నీకు స్వాస్థ్యముగాను భూమిని
దిగంతములవరకు సొత్తుగాను ఇచ్చెదను. ఇనుపదండముతో నీవు
వారిని నలుగగొట్టెదవు. కుండను పగులగొట్టినట్టు వారిని
ముక్కచెక్కలుగా పగులగొట్టెదవు. కాబట్టి రాజులారా, వివేకులై
యుండుడి. భూపతులారా, బోధనొందుడి. భయభక్తులు కలిగి
యెహోవాను సేవించుడి. గడగడ వణకుచు సంతోషించుడి. ఆయన
కోపము త్వరగా రగులుకొనును. కుమారుని ముద్దుపెట్టుకొనుడి;
లేనియెడల ఆయన కోపించును. అప్పుడు మీరు త్రోవ తప్పి
నశించెదరు. ఆయనను ఆశ్రయించువారందరు ధన్యులు!

## అంతిమ తీర్పు

శాశ్వత రాజ్యమునకు ముందు ఒక అంతిమ తీర్పు జరుగబడుతుంది. అవినీతి మంతులు అందరూ దేవుని సముఖమున నిలుచొని వారి వారి క్రియలచొప్పున తీర్పు పొందుటకు పునరుత్థానము చెందుదురు (ప్రకటన 20:5, 11-15). పాతాళములో ఉన్న ప్రతి ఒక్కరూ ఆ తీర్పు నిమిత్తము "దవళమైన మహా సింహాసనము" యెదుటకు తీసుకొనిరాబడతారు. పిమ్మట వారు గెహన్నా అను అగ్ని గుండములోనికి పడద్రోయబడతారు. దీనిని " రెండవ మరణం" అంటారు (ప్రకటన 20:14).

రెండువేల సంవత్సరాల క్రితం యేసు చెప్పిన వాగ్దానం: "ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు" (మత్తయి 24:35), ఆ వాగ్దానమును నెరవేరుస్తూ, ఈ మొదటి భూమి మరియు పరలోకము గతించిపోయి శాశ్వత రాజ్యం ప్రారంభమవుతుంది.

పేతురు తన రెండవ పత్రికలో చెప్పిన ప్రకారంగా, దేవుడు ఒక క్రొత్త పరలోకం మరియు భూమిని అప్పుడు సృష్టిస్తాడు:

అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు

మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక, ఆకాశములు రవులుకొని లయమైపోవునట్టియు, పంచ భూతములు మహా వేండ్రముతో కరిగిపోవునట్టియు, దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను, భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను. అయినను మనమాయన వాగ్దానమునుబట్టి క్రొత్త ఆకాశముల కొరకును, క్రొత్త భూమికొరకును కనిపెట్టుచున్నాము; వాటియందు నీతి నివసించును (2 పేతరు 3:10-14; మరియు యెషయా 65:17-18ని కూడా చూడుము).

చివరిగా, పరలోకం నుండి ఆ క్రొత్త యెరూషలేము భూమి మీదికి దిగివస్తుంది (ప్రకటన 21:1-2). అమెరికాలో సగం విస్తీర్ణముగల ఆ పట్టణము మరియు దానికున్న మహిమల గురించి (ప్రకటన 21:16 చూడుము) మరియు అసలు వృద్ధాప్యమే ఎరుగని ఆ అద్భుతాల గురించి మనకు అంతుపట్టదు. దేవుని పరిపాలన క్రింద యేసు క్రీస్తు మహిమకొరకు మనం ఎల్లప్పుడూ పరిపూర్ణమైన ఆయన పాలనలో జీవిస్తూ ఉంటాము!

